ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 34.0
కనిష్ఠం : 26.0

'సర్‌ప్లస్'లో

సర్దుబాట్లు.. కొందరికే...!



- జిల్లాలో మిగులు ఉపాధ్యాయులు 836 - వర్క్ అడ్జస్ట్‌మెంట్ వెకెన్సీలు 499
- స్కూల్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్ పూర్తయ్యాకే ఎస్జీటీల జాబితా ఓపెన్
- నేడు అన్ని మండలాల్లో పూర్తిస్థాయిలో భర్తీకి కసరత్తు

ఏలూరు అర్బన్, ఆగస్టు 19 : మండలాల్లో మిగులు (సర్‌ప్లస్) ఉపాధ్యాయులకు వర్క్ అడ్జస్ట్‌మెంట్ కౌన్సెలింగ్ ఎట్టకేలకు సోమవారం సాయంత్రం ప్రారంభమైంది. అయితే ఇది 'మూడడుగులు ముందుకి ఏడడుగులు వెనక్కి' అన్న చందాన జరుగుతోందని చెప్పవచ్చు. జిల్లాలోని మొత్తం 28 మండలాల్లో ఎంఈవోల ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ జరగాల్సి ఉండగా, ఎటువంటి అభ్యంతరాలు తలెత్తని 13 మండలాల్లో తొలుత స్కూల్ అసిస్టెంట్ కేడర్ సబ్జెక్టు టీచర్ల కొరత వున్న పాఠశాలలకు సర్దుబాటు చేశారు. అందులోనూ మండలానికి సగటున ఐదుకు మించి వెకెన్సీలకు కౌన్సెలింగ్ జరుగలేదని సమాచారం అందుతోంది. తాము లేవనెత్తిన అభ్యంతరాలపై పరిష్కారం చూపకుండా పని సర్దుబాటు చేస్తామంటే అంగీకరించబోమని పలుచోట్ల టీచర్లు తెగేసి చెప్పేయడంతో మిగతా మండలాల్లో స్థానికంగా సీనియార్టీ జాబితాలపై అభ్యంతరాలు వచ్చిన చోట వాటిని సరిచేసేందుకు వీలుగా మంగళవారానికి వాయిదా వేశారు. కాగా ముందుగా స్కూల్ అసిస్టెంట్ సబ్జెక్టు టీచర్ల కొరతను మండలంలో, డివిజన్ పరిధిలో సర్దుబాటు చేసిన తర్వాతే సర్‌ప్లస్ ఎస్జీటీల అడ్జస్ట్ ప్రక్రియను చేపట్టాలని తాజాగా నిర్ణయించారు. ఆ ప్రకారం ఏలూరు జిల్లాలో పలు సవరణల అనంతరం సర్‌ప్లస్ టీచర్ల సంఖ్య మొత్తం 836గా నిర్ధారించగా, వీరిలో ఎస్జీటీలు 616 మంది, స్కూల్ అసిస్టెంట్లు 220 మందిగా తేల్చారు. ఇక వర్క్ అడ్జస్ట్‌మెంట్‌కు వెకెన్సీల విషయానికి స్కూల్ అసిస్టెంట్లు 304, ఎస్జీటీలు 195 కలిపి మొత్తం 499 మాత్రమే ఉన్నాయి. దీనికనుగుణంగా తొలుత 304 స్కూల్ అసిస్టెంట్ కేడర్ సబ్జెక్టు టీచర్ల వెకెన్సీలకు మాత్రమే కౌన్సెలింగ్ చేపట్టాలని నిర్ణయించడంతో మండల పరిధిలో పని సర్దుబాటుపై భర్తీ చేసిన తర్వాత, ఇంకా సర్‌ప్లస్ టీచర్లు (స్కూల్ అసిస్టెంట్లు) ఉంటే వారిని డివిజన్ పరిధిలోకి చేర్చి సంబంధిత డీవైఈవో ఆధ్వర్యంలో కొరతవున్న పాఠశాలలకు సర్దుబాటు చేస్తారు. అప్పటికీ సబ్జెక్టు టీచర్ల కొరత సమస్య పరిష్కారం కాకపోతే సర్‌ప్లస్ ఎస్జీటీల సీనియార్టీ జాబితాలను ఓపెన్ చేసి నిబంధనలకు లోబడి స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో ఆయా సబ్జెక్టు టీచర్లుగా కౌన్సెలింగ్‌పై తాత్కాలికంగా నియమిస్తారు. ఇదికూడా పూర్తయిన తర్వాతే సర్‌ప్లస్ ఎస్జీటీలను అదేకేడర్‌లో కొరత వున్న ప్రాథమిక/ప్రాథమికోన్నత పాఠశాలలకు సర్దుబాటు చేసే ప్రక్రియను చేపడతారు. సర్దుబాటు పాఠశాలల వెకెన్సీలను కోరుకున్న టీచర్లందరూ ఒకే రోజున సంబంధిత తాత్కాలిక నూతన స్థానాల్లో విధులు చేపట్టేందుకు వీలుగా ఆర్డర్లు ఇస్తారని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. దీనిపై అధికారికంగా నిర్ణయం ఇంతవరకు వెలువరించలేదు. కాగా జటిలంగావున్న ఏలూరు అర్బన్ మండలంలో మునిసిపల్ పాఠశాలల సర్‌ప్లస్ టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్ ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. కార్పొరేషన్ మేనేజ్‌మెంట్‌కు చెందిన మున్సిపల్ టీచర్లను అదే యాజమాన్య పాఠశాలల్లో మాత్రమే సర్దుబాటు చేయాల్సి ఉంటుందని, దీనికి భిన్నంగా వ్యవహరిస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు వెనుకాడ బోమని హెచ్చరిస్తున్నారు. ఏలూరు అర్బన్ మండలంలో 136 మంది ఎస్జీటీలు, 24మంది స్కూల్ అసిస్టెంట్లు సర్‌ప్లస్ జాబితాలో ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాకే సర్దుబాట్లు చేయాలి..

సర్‌ప్లస్ టీచర్ల జాబితాలు, వెకెన్సీల జాబితా ల్లోని లోపాలను సరిచేసిన తర్వాతే కౌన్సెలింగ్ నిర్వహించాలని పీఆర్టీయూ జిల్లా నాయకులు ఆంజనేయులు, సుబ్బారావు సోమవారం రాత్రి డీఈవో అబ్రహంను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. స్కూల్ అసిస్టెంట్ ఖాళీలను నింపేక్రమంలో ఎస్జీటీల అభీష్టాన్ని పరిగణనలోకి తీసుకున్న తర్వాతే భర్తీ చేయాలని, స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీల కౌన్సెలింగ్‌ను సమాంతరంగా నిర్వ హిస్తూ ఉపాధ్యాయులకు నచ్చిన ఆప్షన్ ఎంచుకునే అవకాశం కల్పించాలని అభ్యర్థించారు. వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియపై సందేహాల నివృత్తికి డీఈవో కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

టీచర్లపై నిర్బంధం తగదు : ఏపీటీఎఫ్

పని సర్దుబాటు ప్రక్రియలో టీచరు బోధిస్తున్న సబ్జెక్టులో సంబంధిత మండలంలో ఖాళీ లేకుంటే ఇతర సబ్జెక్టులో బోధించాలని నిర్బంధం చేయడం సరికాదని ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు రామారావు,



ఆనంద్ కుమార్, శ్రీనివాస్, పొట్టియ్య తదితరులు డీఈవో అబ్రహంను కలుసుకుని అభ్యంతరాలను తెలిపారు. ఎస్జీటీలను వేరే పాఠశాలలో మెథడాలజీ సబ్జెక్టు అర్హతలతో స్కూల్ అసిస్టెంట్ కేడర్ పోస్టుని కోరుకోవాలని ఒత్తిడి చేయడం తగదన్నారు. ఎస్జీటీల అభీష్టం మేరకే స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కోరుకునేలా వెసులుబాటు కల్పిస్తామని ఇటీవల ఉపాధ్యాయ సంఘాలతో జరిపిన చర్చల సందర్భంగా హామీ ఇచ్చిన ఉన్నతాధికారులు ఇప్పుడు భిన్నంగా వ్యవహరించడం ఆమోదయోగ్యం కాదన్నారు. అందుబాటులో వున్న వెకెన్సీల నుంచి టీచరు తనకు నచ్చిన పాఠశాలకు ఆప్షన్ ఇచ్చుకునే వెసులుబాటు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాలన్నీ జిల్లాస్థాయిలో పరిష్కరించలేమని, ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని డీఈవో సమాధానమిచ్చారు.

కట్.. కటా!



పెరిగిన విద్యుత్ వినియోగం.. అప్రకటిత కోతలు

- వర్షాకాలామా.. వేసవి కాలమా?
- జిల్లాలో విభిన్న వాతావరణ పరిస్థితులు
- ఠారెత్తిస్తున్న ఎండలు..తీవ్ర ఉక్కపోత.. ఆగస్టులోను వర్షాభావ పరిస్థితులు..
- ఎక్కడ చూసినా వేసవి ఛాయలు
- సముద్రాలు, భూమి, ఉపరితలం వేడెక్కడమే కారణమంటున్న వాతావరణ నిపుణులు

ఏలూరు సిటీ, ఆగస్టు 19 : జిల్లాలో విభిన్న వాతావరణం నెలకొని ఉంది. ఎక్కడ చూసినా వేసవిని తలపించేలా ఎండల తీవ్రత కొనసాగుతోంది. శ్రావణ మాసం అంటేనే వాన ముసురు కొనసాగేది. ఇప్పుడు ఆ పరిస్థితులు ఎక్కడా కనిపించడం లేదు. ఎండల తీవ్రతకు తోడు ఉక్కబోత విపరీతంగా పెరగడంతో ప్రజలు ఎండవేడిమి తాళలేక అల్లాడుతున్నారు. శ్రావణ మాసంలో ఎడతెరపి లేకుండా వర్షాలు కురిసి, రోజుల తరబడి ముసురు కొనసాగే పరిస్థితులు ప్రస్తుతం కనుమరుగయ్యాయి. ఆగస్టులో వర్షాలు జోరు ఎక్కువగా ఉండాలి. కాని ప్రస్తుతం ఆ పరిస్థితులు కనిపించడం లేదు. ఖరీఫ్ పంటలకు దోహదం చేసేలా ముసురుపట్టి వర్షాలు కురియాలి. కానీ ప్రస్తుతం వర్షాకాలామా.. వేసవి కాలమా? అన్న సందేహాలు తలెత్తుతున్నాయి.

తప్పిన అంచనాలు

ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో సాధారణం కంటే ఎక్కువగా వర్షపాతాలు నమోదు అవుతాయని వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. అయితే గత రెండున్నర నెలల కాలాన్ని పరికించి చూస్తే వాతావరణంలో అనేక మార్పులు వచ్చాయని చెబుతున్నారు. వర్షాలకు భూమి, ఆకాశం, సముద్రాలు సహకరించాలి. అంటే మూడింట మధ్య ఏర్పడే తేడాల కారణంగా వర్షాలు కురియాల్సి ఉంది. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో ఈ మూడూ వేడెక్కడంతో సమతుల్యత తప్పిందని, ఈ పరిస్థితుల కారణంగా జిల్లాలో వర్షాలు అంతంత మాత్రంగానే కురుస్తున్నాయని చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో రోజువారీ ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే 34 నుంచి 36 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పగలు ఎండ వేడిమి, రాత్రి సమయాల్లో తీవ్రంగా ఉక్కబోత, అప్పుడప్పుడు ఒకసారిగా కొద్దిపాటి వర్షం ఆపై మళ్లీ తీవ్రంగా ఎండ.. ఇదీ ప్రస్తుత వాతావరణం. వాతావరణంలో వచ్చిన మార్పులు కారణంగా ఎక్కడ చూసినా జ్వర పీడితులు కనిపిస్తు న్నారు. దగ్గు, రొంప వంటి వ్యాధులు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

పంటలపై ప్రభావం అధికం

ఆగస్టులో వర్షాభావ ప్రభావం ఖరీఫ్ సాగుపై పడింది. ఈ సీజన్‌లో నీటి లభ్యత ఏ విధంగా ఉంటుందోనన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటికీ జిల్లాలోని కొన్ని మండలాల్లో అతిస్వల్పంగా వర్షపాతం నమోదయింది. ఆయా ప్రాంతాల్లో సాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల ఆగమనం ముందుగానే ప్రారంభం కావడంతో జిల్లాలో ఖరీఫ్ సాగు ముందుగానే ఆరంభ మైంది. మధ్యలో అల్పపీడనాలతో భారీగా కురిసిన వర్షాలతో వరదల కారణంగా వరి నారు మళ్ళు, నాట్లు దెబ్బతిన్నాయి. ఇప్పుడు నీటి లభ్యత ఎక్కువగా ఉండాల్సిన సమయంలో వర్షాల జాడ అంతంత మాత్రంగానే కనిపిస్తోంది.

ఉమ్మడి పశ్చిమలో పెరిగిన విద్యుత్ వినియోగం

ఇప్పుడున్న విభిన్న వాతావరణ పరిస్థితుల్లో గతంతో పోలిస్తే రోజువారీ విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. ఈ కారణంగా విద్యుత్ అంతరాయాలతో పాటు అప్రకటిత విద్యుత్ కోతలు అమలు చేస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా తరచూ ట్రాన్స్‌ఫార్మర్లలో సాంకేతిక ఇబ్బందులు ఏర్పడడం, విద్యుత్ కోటా కు విద్యుత్ వినియోగానికి మధ్య తీవ్ర వ్యత్యాసం ఉండడంతో అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తున్నారు. అయితే తరచూ సాంకేతిక సమస్యలు , ఈదురు గాలుల ప్రభావం కారణంగా విద్యుత్ అంతరాయాలు మాత్రమే ఏర్పడుతున్నాయని, విద్యుత్ కోతలు విధించడం లేదని విద్యుత్ ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని చాలా ప్రాంతాల్లో విద్యుత్ వినియోగం పెరిగిందని, గతేడాదితో పోలిస్తే విద్యుత్ కోటా కన్నా ఎక్కువగానే విద్యుత్ వినియోగం జరుగుతోందని విద్యుత్ శాఖ నివేదికలు చెబుతున్నాయి.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో గత ఏడాదితో పోల్చితే గత ఎనిమిది రోజుల్లో విద్యుత్ వినియోగం మిలియన్ యూనిట్లలో..

2024	మిలియన్ యూనిట్లలో..		2023	
కోటా	వినియోగం	ఆగస్టు	కోటా	వినియోగం
18.977	17.141	11	20.941	21.272
18.534	17.411	12	21.550	21.299
18.631	18.591	13	21.600	21.256
18.053	19.350	14	21.497	21.124
19.339	18.900	15	21.262	21.314
18.837	19.640	16	21.406	21.724
18.945	19.169	17	20.824	19.733
18.406	20.066	18	21.367	17.871
149.722	150.268	మొత్తం	170.447	165.594



పవిత్రాలను శిరస్సుపై ఉంచుకుని అర్చకుల ప్రదక్షిణలు

కన్నుల పండువగా.. పవిత్రారోపణ

ద్వారకా తిరుమల, ఆగస్టు 19 : చిన తిరుమలేశుని ఆలయంలో జరుగుతున్న శ్రీవారి దివ్యపవిత్రోత్సవాల్లో భాగంగా సోమవారం పవిత్రారోపణ వేడుక కన్నుల పండువగా జరిగింది. రెండు రోజులుగా జరుగుతున్న ఉత్సవాలను పురస్కరించుకుని ఉదయం యాగశాలలో అగ్ని ఆరాధన, చతుర్ధకలశ స్నపనను అర్చకులు వేదమంత్రోచ్చరణల నడుమ జరిపారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వెండి తొళక్క వాహనంపై ఉంచి అలంకరించి హారతులిచ్చారు. పవిత్రాలను ఋత్వికులు తమ శిరస్సులపై ఉంచుకుని మేళతాళాలు, మంగళవాయి ద్యాల నడుమ ఆలయ ఆవరణలో ప్రదక్షిణలను నిర్వహించి ఆపై శ్రీవారి మూలవిరాట్‌కు, అమ్మవార్లకు ఉత్సవమూర్తులకు ధరింపజేశారు. అనంతరం హోమాలను జరిపారు.

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు
దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, ఆగస్టు 19 : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని సెప్టెంబరు 5న నిర్వహించనున్న గురుపూజోత్సవానికి సంబంధించి జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అర్హతలుగల ఉపాధ్యా యులు సంబంధిత తనిఖీ అధికారుల ద్వారా తమ దరఖాస్తులను డీఈవో కార్యాలయానికి ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా అందేలా పంపాలి. దరఖాస్తు నమూనాను తనిఖీ అధికారుల నుంచి లేదా డీఈవో ఏలూరు.ఓఆర్‌జీ వెబ్‌సైట్‌లో పొందుపర్చిన నిర్దేశిత నమూనా ప్రకారం ప్రతిపాదనలను సమర్పించాలి. దరఖాస్తులను జిల్లాస్థాయి కమిటీ ద్వారా పరిశీలించిన తర్వాత వారికివచ్చిన మార్కుల ప్రకారం ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులకు ఎంపిక చేస్తారు.

ఐటీడీఏ ఇన్‌-చార్జ్ పీవోగా జేసీ ధాత్రిరెడ్డి బాధ్యతల స్వీకరణ

బుట్టాయగూడెం, ఆగస్టు 19 : కేఆర్ పురం ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీవోగా జేసీ పి.ధాత్రిరెడ్డి సోమవారం ఏలూరులో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన పీవో ఎం.సూర్యతేజ కర్నూల్ జిల్లా మునిసిపల్ కమిషనర్‌గా బదిలీ కావడంతో ఇన్‌చార్జి పీవోగా ఎస్డీసీ జి.శ్రీనుకుమార్‌ను నియమించారు.



అనంతరం ఐటీడీఏ పీవోగా ఓ మహిళా ఐఏఎస్‌ను నియమించినా ఆమె విధుల్లో చేరకపోవడంతో శ్రీనుకుమార్ ఇన్‌చార్జి పీవోగా కొనసాగుతున్నారు. ఇటీవల జేసీ ధాత్రిరెడ్డికి పీవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు.

రాయితీ రుణాల్లేవ్

గత వైసీపీ సర్కార్ నిర్వాకమిది

- ఐదేళ్లుగా జాడ లేని ఉపాధి కల్పన
- అలంకార ప్రాయంగా కార్పొరేషన్లు
- నిరుద్యోగులతో పాటు అన్ని వర్గాల ఎదురు చూపులు
- కూటమి ప్రభుత్వం రాకతో మళ్లీ ఆశలు
- బీసీలకు పెద్దపీట వేస్తూ సీఎం చంద్రబాబు ప్రకటన

ఏలూరు రూరల్, ఆగస్టు 19 : గత వైసీపీ సర్కార్ అన్ని వర్గాలకు నవరత్నాల పథకాల పేరిట ఎంతో మేలు చేస్తున్నట్టు ఆర్భాటంగా ప్రచారం చేసింది. ఎక్కడికక్కడ ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు గతంలో ఎన్నాడు లేనంతగా అన్ని వర్గాల సంక్షేమానికి తమ ప్రభుత్వం పాటు పడుతోందని ఊదరగొట్టేవారు. వాస్తవానికి సంక్షేమం మాట ఎలా ఉన్నా అప్పటికే అమలులో ఉన్నా పథకాలు సైతం వైసీపీ సర్కార్ తీరుతో నిలిచిపోయి రాయితీ రుణాలు అందక నిరుద్యోగ యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

రాయితీ రుణ పథకాలకు చెక్

రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి వివిధ కార్పొరేషన్‌ల ద్వారా మంజూరయ్యే రాయితీ రుణ పథకాలు నిలిచిపోయాయి. అంతకు ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో 16 కార్పొరేషన్లు ఉండగా, వైసీపీ ప్రభుత్వం ఆ సంఖ్యను 80కి పెంచింది. సామాజిక వర్గానికి ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. చైర్మన్‌తో పాటు సభ్యులను నియమించింది. అంతవరకు బాగానే ఉంది కాని ఆయా సామాజిక వర్గాల సంక్షేమానికి కాని నిరుద్యోగ యువతకు కాని రుణ పథకాలు ప్రకటించలేదు. గతంలో సంక్షేమ శాఖలు ప్రకటించే వార్షిక ప్రణాళికల కోసం నిరుద్యోగ యువత ఎదురు చూసేవారు. వెనుకబడిన తరగతుల వారి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కులాల వారీ ఏర్పాటు చేసుకునే సంఘాల (ఫెడరేషన్)లకు 50 శాతం సబ్సిడీతో కూడిన గ్రూపు రుణాలను అందించేవారు. గరిష్ఠంగా రూ.30 లక్షల వరకు మంజూరు చేసేవారు. ఈ మేరకు ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఏటా అన్ని కార్పొరేషన్ల పరంగా రాయితీతో కూడిన యూనిట్ల ఏర్పాటుకు సగటున రూ.150 కోట్లకు పైగా మంజూరు అయ్యేవి. 2017-18 ఏడాది వరకు రాయితీ రుణాలు మంజూరు ప్రక్రియ సక్రమంగానే సాగింది. 2018-19కి సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు తదితర కార్పొరేషన్ల పరంగా ఉమ్మడి పశ్చిమ జిల్లాకు రూ.150 కోట్ల రుణలక్ష్యంగా నిర్ణయించి, 11 వేలకు పైగా యూనిట్ల ఏర్పాటు కోసం లబ్ధిదారులను



ఎంపిక చేశారు. ఈ ప్రక్రియ ముగిసే సమయానికి సార్వత్రిక ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో రుణాలు మంజూరు కాలేదు. ఎన్నికలు పూర్తయిన తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ రుణాల గురించి పట్టించుకోలేదు. అయితే వైసీపీ సర్కార్ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లకు గౌరవ వేతనాలు ఇచ్చింది. కాని నిధులు లేని కార్పొరేషన్లుగా అవి మిగిలిపోయాయి. తెలుగుదేశం ప్రభుత్వం ఎన్టీఆర్ విద్యోన్నతి పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా యువతకు శిక్షణ అందించింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఈ పథకాన్ని కూడా రద్దు చేసింది.

బీసీలను మభ్యపెట్టారు

బీసీల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని గత ప్రభుత్వంలో గొప్పలు చెప్పారు. గతంలో ఎన్నడూలేని విధంగా కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని ఆర్భాటం చేశారు. బీసీ కులాల్లో కేవలం ఐదు రకాల కులవృత్తుల వారికే నవరత్నాలు అందించారు. అన్నివర్గాలకు అందే పథకాలనే బీసీలకు ప్రత్యేకంగా ఇచ్చినట్టు మభ్యపెట్టారు. ఎన్నడూలేని విధంగా బీసీల కులాల వారందర్నీ ఉద్ధరించినట్లు హడావుడి చేశారు. సీన్ కట్ చేస్తే కార్పొరేషన్లకు పాలక వర్గాలు నియమించి వైసీపీ ప్రభుత్వం బీసీల సంక్షేమానికి రూపాయి కూడా ఖర్చు చేయలేదు. గత ఐదేళ్లలో జగన్ సర్కార్ చేసిన నిర్వాకమిది. బీసీల వివాహాలు, వేడుకల నిర్వహణకు కమ్యూనిటీ భవనాల నిర్మాణాలను నిర్మించతలపెట్టింది. వైసీపీ ప్రభుత్వం ఆ పనులను రద్దు చేసింది.

బీసీలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట

ఇటీవల కొలువుదీరిన కూటమి ప్రభుత్వం బీసీలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేలా ప్రణాళికలు రచించాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేయడం పట్ల నిరుద్యోగ యువత హర్షం వ్యక్తం చేస్తున్నారు. కేంద్రప్రభుత్వ పథకాలైన పీఎం విశ్వకర్మయోజన, జాతీయ నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్, ఎంటర్ ప్రెన్యూర్, డెవలప్‌మెంట్ ప్రాజెక్టు తదితర పథకాలను ఉపయోగించుకుని ఏటా ఐదు లక్షల మంది బీసీలకు స్వయం ఉపాధి కల్పించనున్నట్టు చంద్రబాబు ప్రకటన చేయటం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఆదరణ వంటి పథకాలతో టీడీపీ ప్రభుత్వం బీసీలకు అండగా నిలిచింది. తాజాగా వారి స్వయం సమృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ నైపుణ్యశిక్షణ, కేంద్రపథకాల వినియోగం, రాష్ట్రప్రభుత్వం నుంచి నిధులు కేటాయింపు వంటి వాటిపై నిర్ణయం తీసుకోవాన్ని స్వాగతిస్తున్నట్టు నిరుద్యోగ యువత పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో మళ్లీ అన్ని కార్పొరేషన్ల ఆధ్వర్యంలో రుణాలు ఇచ్చే అవకాశం ఉంది. దీంతో నిరుద్యోగ యువతతో పాటు అన్ని వర్గాలు కూటమి ప్రభుత్వం పైనే ఆశలు పెట్టుకున్నారు.

త్వరితగతిన సమస్యల పరిష్కారం

- కలెక్టర్ వెట్రిసెల్వి.. ప్రజల నుంచి 184 అర్జీల స్వీకరణ

ఏలూరు రూరల్, ఆగస్టు 19 : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అందిన అర్జీలను నిర్దేశించిన సమయంలోగా వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను, ఫిర్యాదులను స్వీకరించారు. కలెక్టర్‌తో పాటు జేసీ పి.ధాత్రిరెడ్డి, డీఆర్వో డి.పుష్పమణి, డీఆర్‌డీఏ పీడీ విజయ్‌రాజు తదితరులు అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. 184 అర్జీలు నమోదయ్యాయి. కలెక్టర్ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్‌ఏ లేకుండా అర్జీల పరిష్కారతీరు ఉండాలన్నారు. సమస్యలను పరిష్కరించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పెండింగ్, రీ ఓపెనింగ్ లేకుండా అర్జీల పరిష్కార తీరు ఉండాలన్నారు. వార్షిక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా నేటి నుంచి హౌస్-2 హౌస్ పరిశీలనను బీఎల్‌వోలు చేపట్టాల్సి ఉందని, చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌లను కలెక్టర్ ఆదేశించారు.

అర్జీల్లో కొన్ని.. విభిన్న ప్రతిభావంతుల కింద అందిస్తున్న రూ.6 వేలు పింఛన్‌ను పొందుతున్నామని, తమ ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా రూ.15 వేలు పొందేందుకు చర్యలు తీసుకోవాలని భీమడోలుకు చెందిన కొండా శిరీషా, తమ స్థలం సర్వేచేసి డాక్యుమెంటేషన్ మేరకు సరిహద్దులు నిర్ధారించాలని ఏలూరుకు చెందిన కంది వెంకటేశ్వరరావు, తమ భూమికి సంబంధించి దస్తావేజు పాస్‌పుస్తకం ఉందని, కొలతల ప్రకారం భూమి తగ్గుతుందని సర్వే చేసి తమ భూమి నిర్ధారించాలని జంగారెడ్డిగూడెంకు చెందిన బి.శ్రీనివాసరావు అర్జీలు అందజేశారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండండి : ఎస్పీ

ఏలూరు క్రైం, ఆగస్టు 19 : సైబర్ నేరగాళ్లు ఫోన్లు చేసి వేరేవారికి వేయాల్సిన డబ్బులను మీ అకౌంట్‌లో వేశామని దయచేసి నా డబ్బులు నాకు వెనక్కి ఇప్పించండి అని బతిమలాడి మీ ఫోన్‌కు ఓటీపీ వస్తుంది చెప్పండి అంటూ ఓటీపీ తీసుకుని మీ అకౌంట్ల సొమ్ములను ఖాళీ చేస్తారని ఇలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కేపీఎస్ కిశోర్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 41 మంది ఫిర్యాదు దారుల నుంచి ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు బ్యాంక్ అధికారులమని మాయ మాటలు చెప్పి అకౌంట్, ఓటీపీ నెంబర్లు అడుగుతారని వారిని నమ్మవద్దన్నారు. ఎవరైనా మోసానికి గురైతే సైబర్ సెల్ నెంబర్ 1930కు సమాచారం అందించాలన్నారు. చట్ట ప్రకారం సత్వరమే పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. ఎస్ఈబీ అదనపు ఎస్పీ ఎస్.సూర్యచంద్రరావు పాల్గొన్నారు.




ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ కిశోర్

23న గ్రామ సభలు

- ఉపాధి హామీలో చేపట్టాల్సిన పనులు చర్చించి తీర్మానం : డీపీవో విశ్వనాథ్

ఏలూరు సిటీ, ఆగస్టు 19 : జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఈనెల 23న గ్రామ సభలు ఏర్పాటు చేసి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టాల్సిన పనులను చర్చించి తీర్మానిస్తామని డీపీవో తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి కొణిదెల పవన్ కల్యాణ్‌కు వివరించారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాల్సిన పనులపై రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ కార్యదర్శులతో కలిసి రాష్ట్రంలో జిల్లా పరిషత్ సీఈవో, పంచాయతీరాజ్, డ్వామా, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, మండల స్థాయి అధికారులతో డిప్యూటీ సీఎం సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ 23న రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లోను గ్రామ సభలు ఏర్పాటు చేసి, ఆయా గ్రామాల్లో 2024-25 సంవత్సరంలో చేపట్టాల్సిన పనులపై గ్రామస్థులను భాగస్వాములు చేయాలని, వారితో చర్చించి వారు కోరిన పనులు చేపట్టేలా తీర్మానం చేయాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో ఎటువంటి అవినీతికి తావులేకుండా పారదర్శకత, జవాబుదారీ తనంతో నిర్వహించాలన్నారు. సామాజిక తనిఖీలో వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. డీపీవో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో 4 విభాగాల్లో పనులు గుర్తిస్తామన్నారు. జడ్పీ సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావు, డ్వామా పీడీ రాము, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సత్యనారాయణ, మైక్రో ఇరిగేషన్ పీడీ రవికుమార్, ఉద్యాన శాఖ డీడీ రామ్మోహన్ పాల్గొన్నారు.



కొండవాగులు పొంగాయి..

ఏజెన్సీ ప్రాంతంలో సోమవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి అటవీ ప్రాంతంలోని కొండవాగులు ఉధృతంగా ప్రవహించాయి. భారీవర్షం కారణంగా మన్యం దేవత గుబ్బల మంగమ్మతల్లి ఆలయం వద్ద ఉన్న ఎర్రఎక్కుడు కొండవాగు సుడులు తిరుగుతూ ఉధృతంగా ప్రవహించింది. వాగులు తెల్లవారుజామున పొంగడంతో ఆలయానికి వెళ్ళే భక్తులకు ఇబ్బందులు తప్పలేదు. గురువారం, ఆదివారం తప్ప మిగతా రోజుల్లో భక్తులు అంతగా అమ్మవారి దర్శనానికి వెళ్లరు. దీంతో ఎటువంటి ఇబ్బందులు కలగలేదని కమిటీ సభ్యులు తెలియజేశారు. - బుట్టాయగూడెం

చిన వెంకన్న క్షేత్రంలో పెళ్లి భాజాలు



శ్రావణమాసం...మంచి ముహూర్తం కావడంతో ఆదివారం రాత్రి శ్రీవారి క్షేత్రంలో పెళ్లిళ్లు భారీగా జరిగాయి. చినవెంకన్న సాక్షిగా దాదాపు 150 వరకూ జంటలు ఒక్కటయ్యాయి. ఆలయ అనివేటి మండపంతో పాటు దేవస్థానం కల్యాణ మండపాలు, ప్రైవేటు కల్యాణమండపాలు, సత్రాలు, రూములు పెళ్లిళ్లకు వచ్చినవారిలో ఫుల్ అయ్యాయి. ఎక్కడా ఖాళీ లేకపోవడంతో ఆలయ మెట్లదారిలో కూడా పెళ్లిళ్లు జరిగాయి. గుడి సెంటర్‌లో పెళ్లివారి వాహనాలు ఉండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వివాహాల అనంతరం సోమవారం ఉదయం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

-ద్వారకాతిరుమల

పున్నమి నాగులు



శ్రావణ పౌర్ణమి రెండు సర్పాలు సయ్యాటలాడాయి. స్థానికులు ఆసక్తిగా తిలకించారు. ద్వారకాతిరుమల మండలం సీహెచ్ పోతేపల్లిలో తన పామాయిల్ తోటలో నీరు పెట్టేందుకు సోమవారం యజమాని వెళ్లగా ఈ దృశ్యం కనిపించింది. ముందుగా కొంత భయపడినా కాస్త తేరుకుని పక్క రైతులను పిలిచాడు. దాదాపు గంటసేపు ఇలా పాములు జతకట్టాయి. కొందరు ఆ దృశ్యాలను తమ సెల్‌ఫోన్‌లలో చిత్రీకరించారు. ఈ విషయం అన్నిచోట్లకు పాకి పరిసర ప్రాంత ప్రజలు పెద్ద సంఖ్యలో చూసేందుకు తరలి వచ్చారు.

-ద్వారకాతిరుమల



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో సుబ్బారావు

నేటి నుంచి ఇంటింటా ఓటర్ సర్వే

ఏలూరు రూరల్, ఆగస్టు 19: ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల జాబితా సవరణ తయారీలో భాగంగా మంగళవారం నుంచి ఇంటింటి సర్వే నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసిందని జడ్పీ సీఈవో సుబ్బారావు తెలిపారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. అక్టోబరు 18 వరకు బీఎల్‌వోలు ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. అక్టోబరు 19 నుంచి 28 వరకు అభ్యంతరాలను స్వీకరించాలన్నారు. అనంతరం ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించి, డిసెంబరు 24లోగా అభ్యంతరాలు స్వీకరించాలన్నారు. డిసెంబర్ 24లోగా అభ్యంతరాలపై వచ్చిన పరిష్కార కార్యక్రమం చేపట్టాలన్నారు. 2025 జనవరి 1లోగా ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు జాబితా రూపొందించి సిద్ధం చేసుకోవాలన్నారు. తహసీల్దార్ జి.శేషగిరిరావు, ఎంపీడీవో ప్రణవి, తహసీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ గాయత్రి పాల్గొన్నారు.





ఒకే పేరుతో వేర్వేరుగా ఇచ్చిన ల్యాబ్ రిపోర్టులు.. విలేకరులకు వివరిస్తున్న బాలుడి తండ్రి

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో నిర్లక్ష్యం

బాలుడికి రెండు రకాల రక్తపరీక్ష రిపోర్టులు

అయోమయంలో తండ్రి

ఏలూరు క్రైం, ఆగస్టు 19 : ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రోజూ ఏదో విభాగంలో వైద్యులు, సిబ్బందిపై ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. ల్యాబ్ విభాగంలో ఒక బాలుడికి రక్త పరీక్షకు వస్తే రెండు వేర్వేరు రిపోర్టులు ఇచ్చారు. అక్కడ ఉన్న ఇన్‌ఛార్జి పట్టించుకోక పోవడంతోనే ఇష్టారాజ్యంగా ల్యాబ్ టెస్టులు చేయకుండా ఏదో నెంబర్ వేసి ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. హనుమాన్‌నగర్‌కి చెందిన షాలీమ్‌రత్నం (12) అనే బాలుడికి పది రోజుల నుంచి జ్వరం రావడంతో ఆ బాలుడి తండ్రి ఈనెల 17వ తేదీన ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చాడు. అక్కడ వైద్యులు రక్తపరీక్షలు రాశారు. ల్యాబ్‌కు వెళ్లి రక్త నమూనాలు ఇచ్చారు. రిపోర్టులకు సోమవారం రమ్మని చెప్పడంతో 19వ తేదీ ఉదయం వెళ్లి రిపోర్టు తీసుకున్నారు. ఆ రిపోర్టుపై అనుమానం వచ్చి మళ్లీ వెళ్లి రిపోర్టు అడిగాడు. మళ్లీ వేరే రిపోర్టు రాసి ఇచ్చారు. రెండు రిపోర్టులు ఆ బాలుడి పేరుతోనే ఇచ్చారు. రెండింటికి వేర్వేరుగా ఉండడంతో ఆ తండ్రి అవాక్కయ్యాడు. వెళ్ళి ప్రశ్నిస్తే ల్యాబ్‌లో ఉన్న వారు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. ఆదే విషయాన్ని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ దగ్గరకు వెళ్ళి ఫిర్యాదు చేయగా సెక్యూరిటీ గార్డును పిలిచి అతనితో ల్యాబ్‌కు పంపి ఆ రిపోర్టులు సరిచేసి ఇమ్మాన్నారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితుడు చెబుతున్నాడు. ల్యాబ్‌లలో ట్రైనింగ్ విద్యార్థులతోనే పనులు టెస్టులు చేయిస్తున్నారని, ఇన్‌ఛార్జి పట్టించుకోరనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు తక్షణం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు.

నీళ్ల ట్యాంక్ ఎక్కి..హల్‌చల్

నాలుగు గంటలపాటు హడావుడి..



పోలీసుల అదుపులో మందుబాబు

భీమవరం క్రైం, ఆగస్టు 19: భీమవరం పట్టణంలోని జంక్షన్ రైల్వేస్టేషన్‌కు సమీపంలో ఉన్న నీళ్ళ ట్యాంక్‌పైకి ఒక వ్యక్తి ఎక్కి సోమవారం హల్‌చల్ చేశాడు. తనకు న్యాయం చెయ్యాలని తన భార్య ఇంటికి రానివ్వడం లేదని.. పిల్లలు పట్టించుకోవట్లేదంటూ నీళ్ళ ట్యాంక్‌పై ఉన్న ఇనుప ఊచకు కండువాతో చేతులు కట్టుకుని అందరినీ కంగారు పెట్టాడు. గునుపూడికి చెందిన నాగరాజుగా (43) అక్కడివారు గుర్తించారు. పోలీసులు అక్కడకు చేరుకుని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడతో కిందకు దిగాడు. మద్యం మత్తులో ట్యాంక్‌పైకి ఎక్కినట్లుగా స్థానికులు చెబుతున్నారు.




వేద విద్యార్థులకు ఉత్తీర్ణతా పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ..వేద సమ్మేళనంలో పాల్గొన్న పండితులు,విద్యార్థులు

వేద ఘోషతో పులకించిన సరిపల్లె

వైభవంగా 104వ వేద పరిషత్ సమ్మేళనం

వేద పాఠశాల పూర్వ వైభవానికి కృషి చేస్తాం : ఎమ్మెల్యే

గణపవరం, ఆగస్టు 19: వేదమంత్రాల ఘోషతో గణపవరం మండలం లోని సరిపల్లె గ్రామం మారు మోగింది. స్థానిక గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో 104వ వేద శాస్త్ర పరిషత్ మహాసభ నిర్వహించారు. రెండు రోజులుగా జరుగుతున్న సభలకు దేశంలోని బిహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 105 మంది వేద విద్యార్థులు హాజరయ్యారు.సోమవారం జరిగిన ఈ వేదసభల్లో 105 మంది పరీక్షల్లో పాల్గొనగా 63 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎమ్మెల్యే ధర్మరాజు చేతుల మీదుగా వారికి ఉత్తీర్ణత పత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వేదాలు ఎక్కడా ఘోషిస్తాయో అక్కడ సిరిసంపదలు, సుఖశాంతులు వర్ధిల్లుతాయన్నారు. సరిపల్లెలోని సంఖ్యాద్రి వర్ధక నిలయంలో వేదాలు నేర్చుకుని తిరుపతి, శ్రీశైలం, సింహాచలం, అన్న వరం వంటి ప్రధాన క్షేత్రాల్లో ఆగమ పండితులుగా కొన సాగుతున్నారని అటువంటి వేదనిలయాన్ని పునఃప్రారంభించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని ధర్మరాజు అన్నారు. గణపవరానికి చెందిన కూసం పూడి సుబ్బరాజు, వెంకట సుబ్బమ్మ, దెందుకూరి సుశీల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఆర్థిక సహకారంతో ఏటా ఈ వేద సభలు నిర్వహిస్తు న్నారు. పొత్తూరి వాసురాజు, సాగిరాజు సుబ్బరాజు, సాగిరాజు సాయిరాజు, గాయత్రీ బ్రాహ్మణసేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సమాజహితానికి వేదాల్ని ఉపయోగించాలి



సరిపల్లెకు గత 40 ఏళ్లుగా వస్తున్నాను. 1976లో ఇక్కడి నుంచి వేద విద్యలో పట్టా పొందాను. 1985 నుంచి పరీక్షాధికారిగా వస్తున్నాను. సమాజా భివృద్ధికి వేదాల్ని ఉపయోగించాలి. 104 ఏళ్లుగా దేశంలో వేదపండితులు ఇక్కడ నుంచి వెళ్ళినవారే. కాశి, తిరుమల తిరుపతి, శ్రీశైలం, అన్నవరం, తదితర క్షేత్రాల్లో పనిచేస్తున్నారు.

- గుల్లపల్లి విశ్వనాథ గణాపాఠి, టీటీడీ వేద పాఠశాల అధ్యాపకులు

మొదటిసారిగా పరీక్షాధికారిగా వచ్చాను



సరిపల్లెలో మొదటి సారిగా శుక్ల యజుర్వేద పరీక్షలు ప్రారంభించడంతో పరీక్షాధికారిగా పిలిచారు. తిరుపతి వెంకటేశ్వర వైదిక విశ్వ విద్యాలయం ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాను. యజ్ఞం చేసే విధానం, దాని ఫలితాలు, శుక్ల యజుర్వేదం తెలుపుతోంది. యజ్ఞం ద్వారా వచ్చే వాయువులు, మంత్ర ఉచ్చరణ ద్వారా వచ్చే ధ్వని తరంగాలతో ఆ ప్రాంతంలో ప్రకృతి పరవ శమవుతుంది.

-డాక్టర్ గోవింద్ ప్రసాద్, తిరుపతి, పరీక్షాధికారి

వేద పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించా



సామ వేదపరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాను. ఇక్కడ వేద పాఠశాలకు ప్రాచీన చరిత్ర ఉందని మా కుటుంబ సభ్యులు తెలిపారు. ఇక్కడ వేద పరీక్షల్లో పట్టా పొందితే నా మనుగడకు ఎంతగానో ఉపయోగ పడుతుంది.ఈ పరీక్షల్లో తొలిసారిగా పాల్గొన్నాను. సామవేదం సంగీత లయబద్ధమైనది. ప్రాచీన సంగీతం ఈ వేదం నుంచే పుట్టింది.

-రోహిత్ శర్మ, మహారాష్ట్ర, వేద విద్యార్థి

తొలిసారిగా ఇక్కడ పరీక్షల్లో పాల్గొన్నా



విజయనగరం నుంచి తొలిసారిగా ఇక్కడ పరీక్షల్లో పాల్గొన్నాను. సామ వేదంలో ఉత్తీర్ణత సాధించాను. పట్టా తీసుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. సంప్రదాయానికి, ధర్మానికి ప్రతీకలైన వేదాలను రక్షించుకోవాల్సిన అవసరం ఉంది.

-సాయిచరణ్, విజయనగరం, వేదవిద్యార్థి



తాడేపల్లిగూడెం మండలం జగ్గన్నపేటలో పామాయిల్ సాగుకు మొక్కలు నాటిన ఉద్యానశాఖ అధికారులు

ఉద్యాన వనానికి ఊతం



పామాయిల్‌పై ప్రత్యేక డ్రైవ్
మెగా ప్లాంటేషన్ కోసం ప్రోత్సాహకాలు
వైసీపీ హయాంలో చెల్లించని ప్రభుత్వం
తాజాగా బకాయిలు విడుదల
కొత్త సాగుకు రైతులు ఉరుకులు
ఈ ఏడాది లక్ష్యం 300 హెక్టార్లు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

పామాయిల్ వంటనూనెను భారీ స్థాయిలో ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. వేల కోట్ల రూపాయలు వెచ్చించాల్సి వస్తోంది. ఇటీవల కాలంలో పామాయిల్ ధరలు కూడా పెరిగిపోయాయి. భవిష్యత్తులో దేశీయంగా పామాయిల్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలని కేంద్రం నిర్ణయించింది. సాగు చేసిన రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తోంది. దేశంలో 2022-27 వరకు పామాయిల్ సాగు విస్తరించాలని సంకల్పించారు. ఒక్క మన జిల్లాలోనే 1500 హెక్టార్లలో కొత్తగా పామాయిల్ తోటలు పెంచాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. అయితే రైతులకు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలను వైసీపీ హయాంలో చెల్లించలేకపోయారు. ఇప్పుడిప్పుడే బకాయిలు విడుదలవుతున్నాయి. ఈ ఏడాది 300 హెక్టార్లలో సాగు చేయాలని నిర్ణయించారు. జిల్లాలో తాడేపల్లిగూడెం, మొగల్తూరు. నర్సాపురం, పాలకొల్లు మండలాల్లో పామాయిల్‌కు అవకాశం ఉంది. ప్రతి హెక్టార్‌కు మొక్కలు నాటిన తర్వాత ప్రభుత్వం రూ.29 వేలు చెల్లిస్తుంది. ఎరువులు, ఇతర అవసరాల కోసం రూ.10,400 మంజూరు చేస్తారు. నాలుగు సంవత్సరాల పాటు రూ.10,400 రైతులకు చెల్లిస్తారు. మొక్కలు నాటేందుకు రూ.29వేలు ప్రభుత్వం ఇవ్వనుంది. దాంతో జిల్లాల్లో లక్ష్యాన్ని చేరేందుకు ఉద్యానశాఖ చర్యలు తీసుకుంటోంది.తాడేపల్లిగూడెం రూరల్ మండలం జగ్గన్నపేటలో రైతు పులి సూర్యప్రసాద్‌కు చెందిన 12 ఎకరాల్లో పామాయిల్ సాగుకు మొక్కలు నాటారు. ఉద్యాన శాఖ జిల్లా అధికారి దేవానంద్ కుమార్, ఉద్యానశాఖ డివిజన్ అధికారి శ్రీలక్ష్మి, త్రిబుల్ ఎఫ్ కంపెనీ డీజీం విజయప్రసాద్, రైతులు ఏడుకొండలు, సత్యనారాయణ, కృష్ణ, కామేశ్వరరావు పాల్గొన్నారు.

బుసలు కొడుతున్న కాల్ మనీ

పేదలు, మధ్యతరగతి వారే టార్గెట్

అధిక వడ్డీలు పేరుతో దోచుకుంటున్న దళారులు

భీమవరం క్రైం, ఆగస్టు 19 : కొంతకాలంగా సద్దుమనిగిన కాల్ మనీ వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. పేదలు, మధ్య తరగతి వారే టార్గెట్‌గా వడ్డీలకు డబ్బులిచ్చి తర్వాత వారిని పీక్కు తింటున్నారు. వడ్డీల మీద వడ్డీలు వేసి వారిని సర్వనాశనం చేస్తున్నారు. దీంతో ఆ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. గతంలో బాధితులు ఫిర్యాదు చేస్తే వారిపై కాల్ మనీ కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపేవారు. దీంతో చాలా మంది దళారులు భయపడి అదనపు వడ్డీలు వసూలు చేయడం మానేశారు. ఇటీవల మళ్లీ ఈ వ్యవహారం తెరపైకి వచ్చింది. డబ్బులు ఇచ్చేటప్పుడు చెక్‌లు, నోట్‌లు తీసుకుని వారు పూర్తిగా సొమ్ము చెల్లించినా కూడా అదనంగా డబ్బులు కట్టాలంటూ మెడపై కత్తి పెడుతున్నారు. ఒకరికి రూ.10 వేలు కావాలంటే ముందుగా వడ్డీ రూపంలో రూ.2 వేలు తీసుకుని చేతికి 8 వేలు ఇస్తారు. ఆ సొమ్మును 100 రోజుల్లో కట్టాలి. గడువు దాటితే వారి నుంచి మరో రూ.4 వేలు అదనంగా వసూలు చేస్తారు. దీంతో పేద, మధ్యతరగతి వారు రోడ్డున పడుతున్నారు.



భీమవరంలో దోపిడీ జోరు

భీమవరం పట్టణంలో సుమారు 500 మంది ఈ వ్యాపారంలో ఆరితేరి ఉన్నారు. అదనపు వడ్డీలు వసూలు చేసిన దళారుల్లో రాజకీయ నేతలు కూడా ఉండటం గమనార్హం. ఎన్నికల్లో ఏ పార్టీ గెలిస్తే ఆ పార్టీకి కొమ్ము కాసేవారి సపోర్టుతో ఇలాంటి వ్యవహారాలు చేస్తున్నారు.

- భీమవరం 20వ వార్డుకు చెందిన ఒక వ్యక్తి తన కూతురి వివాహం నిమిత్తం ఒక దళారి వద్ద రూ.50 వేలు అప్పుగా తీసుకున్నాడు. దానికి ఆ దళారి ముందుగానే రూ.10 వేలు వడ్డీగా తీసుకుని మిగిలిన రూ.40 వేలు ఇచ్చాడు. రోజుకు 500 చొప్పున 100 రోజుల్లో కట్టేలా మాట్లాడుకున్నారు. కానీ ఆ వ్యక్తికి వచ్చే రోజు కూలీ రూ.700. కొంతకాలం రూ.500 కొంత కాలం కట్టిన తరువాత అతని తల్లికి అనారోగ్యం రావడంతో ఆసుపత్రిలో వేల రూపాయిలు ఖర్చు పెట్టాడు. దీంతో ఆ దళారి ఒత్తిడి తెచ్చి అతని పేరున ఉన్న సెంటు భూమిని రాయించుకున్నాడు.
- భీమవరం 18వ వార్డుకు చెందిన ఒక మహిళ తన భర్త మద్యానికి బానిసై జూదాలు ఆడి కొన్ని లక్షలు రూపాయలు పోగొట్టాడు. ఆ అప్పులు తీర్చడానికి ఆ మహిళ ఒక దళారి వద్ద లక్ష రూపాయలు అప్పుగా తీసుకుంది. దళారి ముందుగా రూ. 80 వేలు ఇచ్చి రూ.20 వేలు వడ్డీ రూపంలో తీసుకున్నాడు. ఆ మహిళ కట్టలేకపోవడంతో ఆ మహిళ ఇచ్చిన చెక్ నోట్‌ను కోర్టులో వేసి ఆమెను కోర్టు చుట్టూ తిప్పుతున్నాడు. ఇలా చాలా మంది బాధితులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

అధిక వడ్డీలు వసూలు చేస్తే కేసులు

జి.కాళీచరణ్, భీమవరం టూటౌన్ సీఐ



ఎవరైనా అధిక వడ్డీలు వసూలు చేసి బాధితులను ఇబ్బందులకు గురి చేస్తే వారిపై కాల్‌మనీ కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే అలాంటి ఫిర్యాదులు అందాయి. వాటిపై చర్యలు తీసుకున్నాం. ఎవరైనా అధికంగా వడ్డీలు వసూలు చేసి ఇబ్బందులకు గురి చేస్తే నేరుగా వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

క్రైం కార్నర్

అత్యాచారయత్నంపై కేసు నమోదు

ద్వారకాతిరుమల, ఆగస్టు 19: మండలంలోని రామసింగవరానికి చెందిన ఓ మహిళపై అదే గ్రామానికి చెందిన శ్రీను అనేవ్యక్తి దాడి చేసి అత్యాచారయత్నం చేసినట్లు ఆదివారం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సతీష్ తెలిపారు. పొలంలో పని చేసుకుంటుండగా అదే గ్రామానికి చెందిన శ్రీను మహిళను లాక్కుని వెళ్లి కొట్టి గాయపరిచి అత్యాచారయత్నం చేశాడని స్థానికుల సాయంతో ఆమె జంగారెడ్డిగూడెం ఆసుపత్రిలో చేరిందని తెలి పారు. అక్కడ నుంచి వచ్చిన ఎంఎల్‌సి ఆధారంగా శ్రీనుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.




గట్టుపై బైక్

పెరుగుగూడెం పోలవరం కాల్వ గట్టు సమీపంలో మృతి చెందిన శేషయ్య

కాల్వలో పడి ఒకరి మృతి

దెందులూరు,ఆగస్టు 19: మండలంలోని పెరుగుగూడెం, చల్లచింతలపూడి గ్రామాల మధ్య పోలవరం కాల్వ గట్టు పక్కన నీటిగుంటలో పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. మృతుడు నల్లజర్ల మండలం కంసాలకుంట గ్రామానికి చెందిన పదిలం శేషయ్య (32) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.భార్య ఇటీవల మృతి చెందింది.శనివారం బంధువుల గ్రామమైన చల్లచింతలపూడి వచ్చాడు. శనివారం రాత్రి భోజనం చేసి ఉదయమే హైదరాబాద్ డ్రైవింగ్‌కు వెళ్లాలని చెప్పి పడుకున్నాడు. ఆదివారం ఉదయం ఏడు గంటల సమయంలో కంసాలకుంట బయలు దేరాడు. ఏంజరిగిందో తెలియదు గానీ నీటిలో పడి మృతి చెంది ఉన్నాడు. బండి కాల్వ గట్టుపైనే ఉంది. సోమవారం ఉదయం వాహనదారులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. ఆత్మహత్య చేసుకున్నాడా, ప్రమాద వశాత్తు పడిపోయాడా అన్నది తెలియాల్సి ఉంది.

ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

ఏలూరు క్రైం, ఆగస్టు 19 : బాకీ సొమ్ములు తీసుకుని తిరిగి ఇవ్వమని అడిగిన మహిళను కులంపేరుతో దూషించారనే అభియోగంతో ముగ్గురిపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. ఏలూరు రూరల్ మండలం చొదిమెళ్ళలోని సుంకరవారిగూడేనికి చెందిన అరుగుల ఉషారాణి వద్ద పెదవేగి మండలం వంగూరుకు చెందిన కొట్టాడ శ్రీనివాస్ దఫదఫాలుగా మూడు లక్షల రూపాయలు అప్పు తీసుకున్నారు. ఆ సొమ్ములు చెల్లించాలని తన ఇంటికి వెళ్లి అడిగింది. ఆ సమయంలో శ్రీనివాస్ ఇంటి వద్ద లేడు. మరుసటి రోజు ఉషారాణి ఇంటికి శ్రీనివాస్, కొట్టాడ శిరీష, కొట్టాడ సుబ్బారావులు ముగ్గురు వచ్చి కులంపేరుతో దూషించి దుర్భాషలాడారు. సొమ్ములు చెల్లించమని ఏం చేస్తావో చేసుకోమని బెదిరించారు. దీంతో బాధితురాలు ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆ ముగ్గురిపై సోమవారం రాత్రి అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బైనేరు కాల్వలో పడి రైతు మృతి

కొయ్యలగూడెం, ఆగస్టు 19: బైనేరు కాల్వలో పడి రైతు మృతి చెందాడు. కొయ్యలగూడం మండలంలోని రామానుజపురం గ్రామానికి చెందిన అడపా అంకాలయ్య (55) తన గోవులను కాల్వలో తోలుకుని బైనేరు కాల్వ ఒక్కసారిగా ఉధృతంగా ప్రవహించింది. దీంతో ఆ కాల్వలో కొట్టుకుపోయాడు. అనంతరం పోలీసులు, గ్రామస్థులు గాలించగా మృతదేహం లభించింది.

ఫోన్‌పే చేయండి..డబ్బులు పంపిస్తా..

ఏఎస్ఐనంటూ ఫోన్..

ద్వారకాతిరుమల, ఆగస్టు 19: ఘరానా, సైబర్ క్రైమ్‌లు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ద్వారకాతిరుమలలో ఇటీవల ఘరానా మోసానికి ఓ వ్యాపారి మోసబోగా మరో వ్యాపారి, ఓ ఉద్యోగి చాకచక్యంగా తప్పించుకున్నారు. ఇటీవల కొందరు కేటుగాళ్లు ద్వారకాతిరుమలకు చెందిన ఓ వ్యాపారిని బురిడీ కొట్టించారు. దాదాపు నెలక్రితం ఆయనకు ఫోన్ చేసి తాను పోలీసునని తనకు అర్జంట్‌గా డబ్బు కావాలని రూ.45 వేలు ఫోన్‌పే చేస్తే ఆ డబ్బును కానిస్టేబుల్ ద్వారా పంపిస్తానని నమ్మబలికాడు. వ్యాపారి నమ్మి ఫోన్‌పే చేశాడు. కానీ కానిస్టేబుల్ రాలేదు.. ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. మోసబోయానని గ్రహించి చేసేది లేక గమ్మునుండి పోయాడు. తాజాగా ఓ కేటుగాడు ద్వారకాతిరుమలలోని ఓఫంక్షన్ హాల్ యజమానికి, సొసైటీ కార్యదర్శి కిషోర్‌కు ఫోన్‌చేసి తాను ఏఎస్ఐనని తమ కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యంకు యాక్సిడెంట్ అయ్యిందని రూ.50 వేలు ఫోన్‌పే చేస్తే మరో కానిస్టేబుల్‌తో పంపిస్తానని నమ్మబలికాడు. అయితే అప్రమత్తమైన కార్యదర్శి కిషోర్ ముందుగా నగదు పంపండి అప్పుడు ఫోన్‌పే చేయిస్తామని చెప్పడంతో సదరు కేటుగాడు కిక్కురుమనకుండా సైలెంట్ అయ్యాడు.

మెరుగు పేరుతో బంగారం కొట్టేస్తారు

రెచ్చిపోతున్న ఇతర రాష్ట్రాలకు చెందిన ముఠా



భీమవరం క్రైం, ఆగస్టు 19: బంగారం మెరుగుపెడతామంటూ ఇంటికి వచ్చి మాయమాటలు బంగారం దోచుకుపోతున్న ముఠాలు రోజురోజుకు రెచ్చిపోతున్నారు. నిత్యం ఇలాంటి సంఘటనలు జరుగుతున్నప్పటికి ప్రజల్లో మాత్రం అవగాహన రావడం లేదు. భీమవరం మండలం రాయలం గ్రామంలో ఇటీవల ఇలాంటి దోపిడీ చోటుచేసుకుంది. ఉప్పగుంటచెర్వు ప్రాంతానికి చెందిన చిట్టిగుళ్ళ మణి అనే మహిళ వద్దకు రెండురోజుల క్రితం ఇద్దరు వ్యక్తులు వచ్చారు. బంగారం, వెండి వస్తువులు మెరుగు పెడతామని చెప్పడంతో ఆమె తన కాళ్ళ పట్టీలు ఇచ్చింది. మెరుగు పెట్టి ఇచ్చేశారు. అనంతరం మెడలో ఉన్న సూత్రాల తాడు నల్లగా ఉందని మెరుగు పెడతామని చెప్పడంతో తాడు కూడా ఇచ్చింది. వారు వెంట తెచ్చుకున్న కెమికల్స్‌లో ముంచి వెనక్కి ఇచ్చారు. ఇచ్చే ముందు ఆ తాడుకు పసుపు రాశారు. తూకం తగ్గినట్లుగా అనుమానం రావడంతో ఆ మహిళ వారిని నిలదీయడంతో మహిళను గెంటేసి పారిపోయారు. భర్త ఇంటికి వచ్చాక విషయం చెప్పడంతో ఆ వస్తువును బయటకు తీసుకువెళ్లి తూకం వెయ్యగా నాలుగు గ్రాములు తగ్గింది. వెంటనే వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై టూటౌన్ ఎస్ఐ రహ్మాన్ కేసు నమోదు చేశారు. అయితే మెరుగు పెడతామని వచ్చిన వారు బిహార్‌కు చెందిన ముఠాగా పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం పోలీసులు ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.బంగారు ఆభరణాలు,వెండి వస్తువులు పాతబడినా మెరుగుపోయినా అవి ఎక్కడైనా మెరుగు కోసం ఇచ్చేటప్పుడు తప్పకుండా తూకం వేసిన తరువాత ఇవ్వాలి. ఎంత తెలిసిన షాపు అయినా ముందుగా తూకం చూసి మెరుగు అయిన తరువాత కూడా తూకం చూసుకోవాలి.

ఇసుక అక్రమ రవాణా.. ట్రాక్టర్ సీజ్

ముసునూరు, ఆగస్టు 19: మండలంలోని బలివే తమ్మిలేరు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను ముసునూరు పోలీసులు ఆదివారం రాత్రి సీజ్ చేశారు. ముసునూరుకు చెందిన నక్కా వెంకటేశ్వరరావు తన ట్రాక్టర్‌తో అనుమతులు లేకుండా తమ్మిలేరు నుంచి ఇసుకను లోడ్ చేసుకుని ముసునూరు తరలిస్తుండగా గోపవరం శివారు నాగేంద్రపురం సెంటర్ వద్ద దాడిచేసి పట్టుకున్నట్లు ఏఎస్సై నాగభూషణరావు తెలిపారు.

దూర విద్య టెన్త్, ఇంటర్ అడ్మిషన్లకు పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, డీఈవో, జేసీ

ఏలూరు అర్బన్, ఆగస్టు 19: ఏపీ సార్వత్రిక విద్యా పీఠం (అపోస్) దూరవిద్య టెన్త్, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు ముద్రించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్ వెట్రిసెల్వి సోమవారం విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ ఐసీడీఎస్, డ్వాక్రా, మెప్మా, జువనైల్ హోం శాఖల జిల్లా అధికారులు సంబంధిత శాఖల్లో లబ్ధిదారులు, సభ్యులు, మహిళలకు సార్వత్రిక విద్య పదోతరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు కృషి చేయాలన్నారు. దూరవిద్య కోర్సులు పూర్తిచేసుకున్నవారు ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హులని ప్రచారం కల్పించాలన్నారు. ఓపెన్‌స్కూల్స్ అడ్మిషన్లు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని డీఈవో అబ్రహంకు సూచించారు. జేసీ ధాత్రిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంధ విద్యార్థికి డయాస్ ప్లేయర్

ఏలూరు రూరల్: విభిన్న ప్రతిభావంతుడైన విద్యార్థికి కలెక్టర్ వెట్రిసెల్వి డయాస్ ప్లేయర్‌ను అందజేశారు. కంద్రికగూడెంకు చెందిన కందుల మిలన్‌శ్యామ్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తరగతి గదిలో బోర్డుపై చెప్పిన విషయాన్ని రికార్డు చేసుకుని ఇంటి దగ్గర తిరిగి వినేందుకు డయాస్ ప్లేయర్ అవసరమని అర్జీ ఇచ్చాడు. వెంటనే కలెక్టర్ స్పందించి విభిన్న ప్రతిభావంతులశాఖ అధికారులతో మాట్లాడి, డయాస్ ప్లేయర్‌ను శ్యామ్‌కు అందజేశారు.

విశాఖపట్నం జిల్లా గంపరాయ్ నుంచి కె.నాగేశ్వరరావు కుటుంబంతో సహా ఏలూరులో ఉపాధి నిమిత్తం వచ్చాడు. ఏలూరు రైల్వేస్టేషన్‌కు వచ్చాక తమను రమ్మన్న వ్యక్తి ఆచూకీ లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని కలెక్టర్‌ను ఆశ్రయించారు. ఆర్టీసీ అధికారులతో కలెక్టర్ మాట్లాడి వారు స్వగ్రామం చేరేందుకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు. వన్‌స్టాప్ సెంటర్ ద్వారా కొత్త బట్టలు, భోజన వసతి, నగదు సహాయం అందచేయాలని అధికారులను ఆదేశించారు.

జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అనుకూలం : కలెక్టర్

ఏలూరు అర్బన్: జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ఎంతో అనుకూలమని కలెక్టర్ వెట్రిసెల్వి పేర్కొన్నారు. పారిశ్రామికవేత్తలతో సోమవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం అన్నివిధాలుగా సహకరిస్తుందని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఆహారశుద్ధి యూనిట్లు, ఐటి ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. సమావేశంలో లేవనెత్తిన సూచనలు, ఫీడ్‌బ్యాక్‌ను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ జిల్లా అధ్యక్షుడు వంకాయల రామకృష్ణారావు, ఫిక్కీ ప్రతినిధులు ఎన్.వెంకటేశ్వరరావు, ఎస్.భరత్, సీహెచ్.నవ్యశ్రీ, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం ఆదిశేషు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ బాబ్జి, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, డీపీవో విశ్వనాథ్, కర్మాగారాల డీఐ త్రినాథరావు, డీటీసీ శాంతకుమారి పాల్గొన్నారు.

ప్రైవేట్ వైద్యశాలలపై చర్యలు చేపట్టాలి

ఏలూరు రూరల్, ఆగస్టు 19: వైద్యం పేరుతో చిన్నారుల భవిష్యత్‌తో చెలగాటం ఆడిన ప్రైవేట్ వైద్యులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కలెక్టర్ వెట్రిసెల్విని కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో బాధితులతో కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. పత్తేబాదలోని ప్రైవేట్ ఆసుపత్రి వైద్యులు ఆరోగ్యశ్రీ ద్వారా నిర్లక్ష్యంగా శస్త్రచికిత్స చేశారని, వారి భవిష్యత్ ఇబ్బందిగా మారిందని కలెక్టర్‌కు తెలిపారు. ప్రభుత్వ వైద్య బృందంతో కమిటీవేసి విచారణ చేసి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

స్వయం ఉపాధితోనే నిరుద్యోగ సమస్యకు పరిష్కారం

నన్నయ వీసీ



పట్టా అందజేస్తున్న నన్నయ వీసీ శ్రీనివాసరావు

ఏలూరు అర్బన్, ఆగస్టు 19: ఉన్నత విద్య పూర్తిచేసిన యువత సృజనాత్మకతతో నూతన వ్యాపార అవకాశాలపై దృష్టిసారిస్తే దేశంలో నిరుద్యోగ సమస్య ఉండబోదని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి వై.శ్రీనివాసరావు అన్నారు. సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో సోమవారం నిర్వహించిన స్నాతకోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నూతన జాతీయ విద్యా విధానంలోని ముఖ్యాంశాలను ప్రస్తావిస్తూ యువత స్వయం ఉపాధి అవకాశాలపై దృష్టిపెట్టి ఉద్యోగావకాశాలను కల్పించుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ మాట్లాడుతూ కళాశాలలో ఉన్నత విద్య ముగించిన విద్యార్థినులు జీవితంలో ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షించారు. ఫైనలియర్ విద్యార్థినులు క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఉద్యోగాలకు అర్హత సాధించారని వివరించారు. వివిధ కోర్సుల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు ఉప కులపతి బంగారు, వెండి పతకాలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కళాశాల జీవితంలో తమ అనుభవాలను పలువురు విద్యార్థినులు పంచుకున్నారు. కరస్పాండెంట్ మదర్ ఎర్నెస్టైన్ ఫెర్నాండెజ్, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ మరియా క్రిస్టియా, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సిస్టర్ సుశీల, ఇంటర్మీడియట్ కళాశాల ప్రిన్సిపాల్ డిగాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

1 నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు



బీజేపీ జిల్లా కార్యాలయం వద్ద నేతలు

ఏలూరు రూరల్, ఆగస్టు 19: బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా కోర్‌కమిటీ సమావేశం సిహెచ్ విక్రమ్‌కిషోర్ అధ్యక్షతన సోమవారం జరిగింది. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పాల్గొన్నారు. గారపాటి చౌదరి మాట్లాడుతూ సెప్టెంబర్ 1 నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మొదలవుతుందని, సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే ఏలూరు జిల్లా ముందంజలో ఉండాలన్నారు. జిల్లా సభ్యత్వ ప్రముఖ్ శరణాల మాలతీరాణి, మరో ముగ్గురిని సహ ప్రముఖులుగా నియమించారు. ఈనెల 22న జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌కిషోర్ పేర్కొన్నారు. సమావేశంలో నరేంద్రప్రకాష్, బి.నిర్మలాకిషోర్, కె.కృష్ణప్రసాద్, జ్యోతి సుధాకర్ కృష్ణ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి

బుట్టాయగూడెం, ఆగస్టు 19: పోలవరం నిర్వాసితులకు భూమికి భూమి ఇచ్చేందుకు బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో జరిపిన భూసేకరణలో అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ చేసింది. బుట్టాయగూడెంలో జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ సోమవారం విలేకరులతో మాట్లాడారు. గతంలో కేఆర్.పురం ఐటీడీఏ పీవోలుగా ఐఏఎస్ అధికారులు కొనసాగిన సమయంలో గిరిజనుల సాగులో ఉన్న ఎల్‌టీఆర్, 1/70 చట్టం పరిధిలోని భూములకు చెందిన రికార్డులను తారుమారయ్యాయన్నారు. గిరిజనేతరుల పేరుతో ఆర్ అండ్ ఆర్‌లో కొనుగోలు చేశారని వీటిపై సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు బయటపడతాయని తెలిపారు. పోలవరం ఎడమ కాలువకు సంబంధించిన ఫైల్స్ దగ్ధం చేయడం అనేక అనుమానాలకు దారితీస్తుందన్నారు. గిరిజనుల సాగులో ఉన్న భూములను గిరిజనేతరుల పేర్లతో నమోదు చేయించుకుని పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని, ఈ విషయంపై అనేక మార్లు ఐటీడీఏ, తహసీల్దార్ కార్యాలయాల వద్ద తాము ఆందోళన చేపట్టామన్నారు. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో భూసేకరణలో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాయకులు ఉడతా వెంకటేశ్వరావు, పూసం మల్లయ్య పాల్గొన్నారు.

ఐటీడీఏకు పూర్తిస్థాయి అధికారిని నియమించండి



మాట్లాడుతున్న ఏఎస్‌పీ నాయకులు

బుట్టాయగూడెం, ఆగస్టు 19 కేఆర్.పురం ఐటీడీఏ పీవోగా ఐఏఎస్ అధికారిని నియమించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా కృష్ణంరాజు డిమాండ్ చేశారు. బుట్టాయగూడెంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐటీడీఏ పీవో 6 నెలలు నుంచి ఏడాది లోపు బదిలీ అవుతున్నారని, ఏజెన్సీ సమస్యలు మూలనపడ్డాయని తెలిపారు. ఐటీడీఏలకు పీవోలను విహార యాత్రలకు పంపిస్తున్నట్లు ఉందని విమర్శించారు. ఐటీడీఏకు వెళ్లి సమస్యలపై దరఖాస్తు ఇస్తే తర్వాత ఆ అధికారి ఉంటారనే నమ్మకం లేదన్నారు. మళ్లీ కొత్తగా వచ్చిన అధికారికి దరఖాస్తు ఇవ్వాల్సి వస్తోందని వాపోయారు. ఇటీవల కాలంలో ముగ్గురు పీవోలు మారగా ప్రస్తుతం జాయింట్ కలెక్టర్‌కు పీవోగా అదనపు బాధ్యతలను అప్పగించారన్నారు. పనుల భారంతో జేసీ ఐటీడీఏకు ఎప్పుడు వస్తారో ఎప్పుడు అందుబాటులో ఉంటారో మారుమూల ప్రాంత ఆదివాసీలకు ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. కనీసం రెండేళ్ల పాటు ఐటీడీఏ పీవోగా కొనసాగేలా ఐఏఎస్ అధికారిని నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పూసం శ్రీను, తెల్లం సూరిబాబు, తామా విష్ణు, నూపా ముత్యాలరావు, కుంజా ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.







ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, దెండులూరు ఎమ్మెల్యే చింతమనేని, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుకు రాఖీలు కడుతున్న తెలుగు మహిళలు



వంకవారిగూడెం వాల్మీకి విజ్ఞాన కేంద్రంలో రాఖీ కడుతున్న విద్యార్థులు

రక్షా బంధన్

ఎమ్మెల్యేలకు రాఖీలు కట్టిన తెలుగు మహిళలు

సోదరి, సోదరుల సందడి

ఆలయాల్లో పూజలు

ఏలూరు టూటౌన్, ఆగస్టు 19: వెలకట్టలేని మధుర బంధమే రక్షాబంధన్ అని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. బడేటి క్యాంపు కార్యాలయంలో సోమవారం రక్షాబంధన్ సందర్భంగా తెలుగు మహిళలు ఎమ్మెల్యే చంటికి రాఖీ కట్టారు. చంటి మాట్లాడుతూ ఐదేళ్లుగా తాను బాగుండాలని, ఎమ్మెల్యేగా ఎన్నికవ్వాలని ఎంతో మంది అక్కచెల్లెళ్లు కోరుకున్నారన్నారు. వారి దీవెనలతో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాయని, రాబోయే ఐదేళ్లలో అక్కచెల్లెళ్ళ అవసరాలు తీర్చి వారి రుణం తీర్చుకుంటానన్నారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. అక్కచెల్లెళ్ళతో రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

● దెందులూరు: మహిళల రక్షణ, ఆర్థిక భద్రతకు టీడీపీ కూటమి ప్రభుత్వం భరోసా ఇస్తుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాలలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం చింతమనేనికి మహిళలు రాఖీ కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు గుడిపూడి రేవతి, వడ్డి వాసవిదేవి, వీర మహిళ యర్రంశెట్టి దేవిక, మహిళలు పాల్గొన్నారు.

● భీమడోలు: మండలంలో రాఖీ వేడుకలు ఘనంగా జరిగాయి. భీమడోలు, గుండుగొలను, పూళ్ళ తదితర గ్రామాల్లో సోదర సోదరీమణులు వేడుకగా నిర్వహించుకున్నారు. భీమడోలులో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు క్యాంపు కార్యాలయంలో రాఖీ పర్వదినాన్ని నిర్వహించారు. తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు మరపట్ల రామతులసమ్మ గన్నికి రాఖీ కట్టారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: నేను నీకు రక్ష, నీవు నాకు రక్ష, మనందరం దేశానికి ధర్మానికి రక్ష అంటూ వంకవారిగూడెం వాల్మీకి విజ్ఞానకేంద్రం ఏవో టిఎస్.రవికుమార్ పిలుపునిచ్చారు. పాఠశాల విద్యార్థులంతా కలసి రాఖీ పండుగ జరుపుకున్నారు. సోదరభావం వెల్లివిరిసేలా విద్యార్థులు రాఖీలు కట్టుకున్నారు. హెచ్ఎం ఎంవీఎస్.సుబ్రమణ్యం, వి.జనార్ధనరావు పాల్గొన్నారు.

● పోలవరం: మండలంలో పలుచోట్ల సోదరులకు చిన్నారులు, మహిళలు, విద్యార్థినులు రక్షా బంధనం కట్టి ఆశీర్వాదం పొందారు. సోదరులు ఆయురారోగ్యాలతో ఉండాలని, తమకు రక్షగా ఉండాలని ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. సువర్చలా సమేత అభయాంజనేయస్వామి, కనకదుర్గ, వాసవీ కన్యకాపరమేశ్వరీ సమేత శ్రీనగరేశ్వరస్వామి ఆలయాలు, పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి శివక్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆడపడుచులు స్వగ్రామాలకు చేరుకుని సోదరులకు రాఖీలు కట్టి ఆశీర్వాదాలు పొంది, తమ్ముళ్ళను దీవించి వెళ్లారు.

● బుట్టాయగూడెం: మండలంలో రాఖీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. దుద్దుకూరులో మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు ఆయన సోదరీమణులు కుమ్మర ముక్కమ్మ, జలగం సత్యవతి రాఖీ కట్టారు.

● ఏలూరు రూరల్: రక్షాబంధన్ వేడుకలు మండలంలోనూ ఘనంగా జరుపుకున్నారు. అక్కాచెల్లెళ్లు సోదరులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. సోదరీమణులకు సోదరులు కానుకలు అందించారు. రక్షాబంధన్‌ను కుల,మతాలకు అతీతంగా జరుపుకున్నారు. అన్నాతమ్ముడు అక్కాచెల్లెలు రాఖీలు కట్టి స్వీట్లు పెట్టారు. అన్ని గ్రామాల్లో రాఖీ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.









జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెంలో మహిళలు, గిరిజనుల ర్యాలీ, ఏలూరులో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నర్సింగ్ విద్యార్థుల ర్యాలీ, కొయ్యలగూడెంలో విద్యార్థులు మానవహారం

కోల్‌కతా హత్యాచార సంఘటనపై

నిరసన

బుట్టాయగూడెం, ఆగస్టు 19: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై హత్యాచారం కేసులో దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో లంకపాకల గ్రామంలో కొండరెడ్లు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. కారం రాఘవ మాట్లాడుతూ ప్రాణాలను కాపాడే వైద్య విద్యార్థిని హత్య చేసిన మూర్ఖులను ఉరికంబం ఎక్కించాలని డిమాండ్ చేశారు. అలివేరు సర్పంచ్ కారం అరుణ, కొండరెడ్లు పాల్గొన్నారు. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం మండలాల్లోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది భారీ ర్యాలీ, ప్రదర్శన, మానవహారం నిర్వహించారు. నల్లబ్యాడ్జీలు ధరించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నెహ్రూబొమ్మ సెంటరులో మానవహారం నిర్వహించి, కొవ్వొత్తులు వెలిగించి వైద్య విద్యార్థి ఆత్మకు శాంతి చేకూరాలని నినదించారు. ఉప వైద్యాధికారి జె.సురేష్‌కుమార్, వైద్యులు జ్ఞానేశ్వర్, మురళీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: వైద్య విద్యార్థిని హత్యాచారం సంఘటన దోషులను కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ప్రభుత్వ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్ మాట్లాడుతూ విద్యార్థులపై ఇటువంటి సంఘటనలు బాధాకరమన్నారు. జూనియర్ కాలేజీ వరకు విద్యార్థులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు.

● జంగారెడ్డిగూడెం: దేశవ్యాప్తంగా మహిళలు, ఆడపిల్లలు, విద్యార్థినులపై పెరుగుతున్న అత్యాచారాలు, హత్య కేసుల్లో దోషులను కఠినంగా శిక్షించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కోశాధికారి కెవి.రమణ డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ, పీవోడబ్ల్యూ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బోసుబొమ్మ సెంటర్ వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. గంపల శ్రీను, ఎండ్రపాటి శ్రీను, కొత్తూరి నాగు,అంజి,రాంబాబు తదితరులు పాల్గొన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని జనసేన నేత మేకా ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. జనసేన, వీరమహిళల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. పీవీ.రామలక్ష్మీ, గురుజు ఉమామహేశ్వరి, డి.రాజీ, కోసూరి కనకమహాలక్ష్మి, షేక్ హసీన, సింగవరపు లక్ష్మి, షేక్ పీరు, చింతల నాని, వలవల తాతాజీ, బాదరాల నరేష్, కాసగాని రామారావు, తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు క్రైం: రెడ్‌క్రాస్ జిల్లా శాఖ, ఏలూరు బార్ అసోసియేషన్, న్యాయవాదులు సంయుక్త ఆధ్వర్యంలో ఫైర్‌స్టేషన్ సెంటర్ వరకు కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ బీవీ.కృష్ణారెడ్డి మాట్లాడుతూ వైద్య విద్యార్థినిపై హత్యాచారం దారుణమన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలని డాక్టర్లు, నర్సింగ్ విద్యార్థినులు, న్యాయవాదులు, లయన్స్ క్లబ్ సభ్యులు నినాదాలు చేశారు. కేబీ సీతారామ్, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె వరప్రసాదరావు, బార్ అధ్యక్షుడు కోనేరు సీతారామ్, భీమవరం బార్ అధ్యక్షుడు ఏలేటి న్యూటన్, యార్లగడ్డ జగన్మోహనరావు, డాక్టర్ బసవరాజు, హ్యూమన్ రైట్స్ కట్ట సత్యనారాయణ, డాక్టర్ జి.స్పందన, న్యాయవాదులు, నర్సింగ్ విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తాం : చింతమనేని

దెందులూరు, ఆగస్టు 19: టీడీపీ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. గాలాయగూడెం అచ్చమ్మపేరాంటలమ్మ ఆలయ అవరణలో సోమవారం మీ కోసం మీ చింతమనేని గ్రామ సభ నిర్వహించారు. పలువురు సమస్యలను చింతమనేని దృష్టికి తీసుకుని వచ్చారు. గాలాయగూడెం గ్రామ పరిధిలో ప్రధాన రహదారి ఇరువైపుల డ్రైనేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చింతమనేని తెలిపారు. పూజారి శ్రీనివాసరావు, ఏనుగు రామకృష్ణ, మిల్లుబాబు, మోతుకూరి నాని, పెద్దిశెట్టి నాని, పూజారి సీతారాం, వెంకటరత్నం నాయడు, మందూరి బుజ్జిగోపాల్, ఎంపీడీవో శ్రీలత, తహసీల్దార్ సుమతి, అధికారులు పాల్గొన్నారు. గంగన్నగూడెంలో సర్పంచ్ ఉప్పలపాటి లక్ష్మణరావు, వెన్నమనేని రాజా, సానిగూడెంలో యలమర్తి శ్రీనుబాబు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉపాధి గ్రామసభల్లో కూటమి కార్యకర్తలు పాల్గొనాలి

ఉంగుటూరు, ఆగస్టు 19: ఉపాధి గ్రామ సభలు 23 నుంచి జరుగుతాయని, కూటమి కార్యకర్తలు తప్పనిసరిగా పాల్గొనాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి కూలీకి వంద రోజుల పని ఉండేలా నిర్ణయం తీసుకోవాలని, గ్రామస్తులంతా అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని ఆయన సూచించారు.

నగరంలో దోమల నివారణకు చర్యలు

ఏలూరు టూటౌన్, ఆగస్టు 19: నగరంలో దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంహెచ్‌వో డాక్టర్ మాలతి తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నగరంలో పారిశుధ్యం మెరుగుపరుస్తున్నామన్నారు. శ్రీరామ్ నగర్ రోడ్డు, భారతీ కాలనీ, నాగేంద్ర కాలనీల్లో దోమల లార్వా నిర్మూలనకు స్ప్రేయింగ్, ఖాళీ స్థలాల్లో ఉన్న నిల్వ నీటిలో సోమవారం అయిల్‌బాల్స్, మురుగు కాల్వలో ఫాగింగ్ చేశామన్నారు. మలేరియా ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలస్వామి, బోసు రాజు, సురేష్‌కుమార్, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మైనార్టీలు రుణాల కోసం దరఖాస్తు చేసుకోండి

ఏలూరు టూటౌన్, ఆగస్టు 19: మైనార్టీలైన ముస్లింలు, క్రిస్టియన్లు, తదితరుల నుంచి రుణాల కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ ఆర్థిక సంస్థ ఈడీ ఎన్ఎస్.కృపావరణ్ తెలిపారు. పూర్తి వివరాలకు కలెక్టరేట్ కంపౌండ్‌లోని మైనార్టీస్ కార్పొరేషన్‌లో వ్యక్తిగతంగా సంప్రదించవచ్చని అన్నారు. లేదా ఫోన్ ద్వారా 08812242463ను సంప్రదించాలన్నారు.

గిరిజనులకు వ్యతిరేకంగా ఇచ్చిన ఆర్డర్ రద్దు చేయాలి

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 19: గిరిజన భూముల్లో భూస్వాములకు అనుకూలంగా ఇచ్చిన ఆర్డర్‌ను రద్దుచేయాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. బుట్టాయిగూడెం మండలం చేనువారిగూడెం గ్రామ పంచాయితీ శివారులో మర్లగూడెం రెవెన్యూ భూముల్లో గిరిజనులు 25 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూముల్లో భూస్వాములకు అనుకూలంగా గత ఆర్డీవో ఇచ్చిన ఆర్డర్‌ను రద్దు చేయాలని వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు టి.రామకృష్ణ, ఎం.జీవరత్నం, మండల కమిటీ సభ్యులు ఎం.వెంకటేశ్వరరావు, పుల్లయ్య, దేవి, అందుగుల ప్రభాకరరావు, సూర్యకిరణ్, తదితరులు పాల్గొన్నారు.

గణపతి షెడ్డు నిర్మాణానికి రూ. రెండు లక్షల విరాళం



దాత హరీష్‌ను సత్కరిస్తున్న గ్రామస్తులు

భీమడోలు, ఆగస్టు 19 : పూళ్ళలో గణపతి ఆలయ షెడ్డు నిర్మాణానికి టీడీపీ నేత పుప్పాల హరీష్ రూ. 2 లక్షల విరాళం అందజేశారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో పూళ్ళ గణపతి ఆలయానికి రేకుల షెడ్డు నిర్మాణానికి ఆర్థిక సహాయం అందజేస్తానని పుప్పాల హరీష్ హామీ ఇచ్చారు. ఈ మేరకు సోమవారం షెడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామస్తులు హరీష్‌ను సత్కరించారు.

చేపల చెరువులలో కోళ్ల వ్యర్థాలను వేస్తే చర్యలు

ఉంగుటూరు, ఆగస్టు 19: చేపల చెరువులలో మేతగా కోళ్ల వ్యర్థాలను వేస్తే చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ పి.సతీష్ హెచ్చరించారు. గ్రామాల పరిధిలో వీఆర్వో, పోలీసు కానిస్టేబుల్, ఫిషరీస్ అసిస్టెంట్‌లతో కూడిన త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసినట్లు సోమవారం ఆయన తెలిపారు. కోళ్ల వ్యర్థాలను తరలించే వాహనాన్ని, వ్యర్థాలను స్వాధీనం చేసుకుని కాలుష్య నివారణ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

శ్రీవారి క్షేత్రంలో ఘనంగా విఖనస జయంతి

ద్వారకాతిరుమల, ఆగస్టు 19: శ్రీవిఖనస మహర్షి జయంతి ఉత్సవాన్ని శ్రీవారి క్షేత్ర జంటగోపురాల వద్ద నిర్మించిన విఖనస ఆలయంలో అర్చకులు, ఆగమ విద్యార్థులు వైభవంగా నిర్వహించారు. విఖనస మహర్షి శిష్యులైన అత్రి, కశ్యపుడు, మరీచి, భృగువుతో కొలువుతీరిన చోట పూజలు చేశారు.

● జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విఖసన జయంతి, శ్రావణ పూర్ణిమ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణ మహోత్సవం ఆలయ ప్రధానార్చకులు నల్లూరి రవికుమారాచార్యులు వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని రుక్మిణీ సత్యభామ సహిత వేణుగోపాలస్వామి ఆలయంలో విఖసన జయంతి సందర్భంగా పండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన వీధుల్లో నగరోత్సవం నిర్వహించారు.

శ్రావణ పౌర్ణమి పూజలు

ఏలూరు కార్పొరేషన్: శ్రావణ పౌర్ణమి సందర్భంగా సోమవారం నగరంలో పలు ఆలయాల వద్ద భక్తులు పూజలు చేశారు. ఆర్ఆర్ పేట వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు తులసి దళాలతో అర్చన చేశారు. సత్రంపాడు అంబికాదేవిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

● కామవరపుకోట: శ్రీలక్ష్మీ హయగ్రీవ లలితాశ్రీ పీఠంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి, అమ్మవారికి అభిషేకాలు, సామూహిక పారాయణ నిర్వహించారు. సుదర్శనం రామదుర్గ కుమారాచార్యులు, సత్య శ్రీనివాసాచార్యులు భక్తులతో పూజలు చేయించారు.

శివాలయంలో మేయర్ దంపతుల పూజలు

ఏలూరు టూటౌన్, ఆగస్టు 19: పవర్‌పేట శివాలయంలో గురుపౌర్ణమి వేడుకల్లో మేయర్ షేక్ నూర్జహాన్, ఎస్ఎంఆర్.పెదబాబు దంపతులు పాల్గొన్నారు. శివాలయంలో అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. చిరంజీవి అభిమానులు అన్నదాన కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు పేదలకు పుస్తకాల పంపిణీ, ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కల్యాణి, ఎస్.రామకృష్ణ, పవన్, ఆది, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

జ్వరం, తలనొప్పి ఉంటే నిర్లక్ష్యం చేయొద్దు



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

లింగపాలెం, ఆగస్టు 19: జ్వరం, తలనొప్పి ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని ధర్మాజిగూడెం పీహెచ్‌సీ డాక్టర్ యాని ప్రీతి అన్నారు. ధర్మాజిగూడెంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఖాళీ స్థలాల్లో నీరు, మురుగు లేకుండా చూసుకోవాలన్నారు. దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని తెలిపారు.

● చింతలపూడి: మండలంలోని రేచర్ల గిరిజన లంబాడీ తండాలో సోమవారం యర్రగుండపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. 42 మందిని పరీక్షించారు. నలుగురికి జ్వరం ఉండడంతో డెంగీ పరీక్షలు జరిపారు. ఎంపీపీ బి.రాంబాబు శిబిరాన్ని సందర్శించారు. ఇంటింటికి వెళ్లి పరిశుభ్రత పాటించాలన్నారు. ఆరోగ్య సిబ్బంది పరిశుభ్రతపై ప్రచారం చేశారు.

ఈ-పంట నమోదు చేయించుకోవాలి

లింగపాలెం, ఆగస్టు 19: రైతులంతా ఈ-పంట నమోదు చేసుకోవాలని ఏవో మురళీకృష్ణ సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ పంట నమోదుతో రైతులు, కౌలు రైతులు బ్యాంకులో రుణాలు పొందే అవకాశం ఉందన్నారు. మండలంలో ఇప్పటివరకు 3వేల ఎకరాలకు ఈ పంట నమోదు ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన రైతులు కూడా నమోదు చేయించుకోవాలన్నారు. మండలంలోని అన్ని రైతుసేవాకేంద్రాల వద్ద వ్యవసాయశాఖ సిబ్బంది అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు.

బాలబాలికలు చక్కగా చదవాలి

ఏలూరు క్రైం, ఆగస్టు 19: బాలబాలికలు చక్కగా చదువుకోవాలని ఐసీడీఎస్ పీడీ కేపీఎల్.పద్మావతి అన్నారు. మిషన్ వాత్సల్య లబ్ధిదారులతో సోమవారం ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలకు వచ్చిన డబ్బులను వారి చదువులకోసం మాత్రమే వాడాలని సూచించారు. డీసీపీవో సూర్యచక్రవేణి మాట్లాడుతూ పిల్లలందరూ ఉన్నత చదువులు చదవాలని సూచించారు. సీడీపీవో ఎ పద్మావతి మాట్లాడుతూ బాల బాలికలు లక్ష్యం దిశగా కష్టపడి చదవాలన్నారు. సూపర్‌వైజర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మానవత ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 19: పట్టణంలో మానవత ఆధ్వర్యంలో శాంతి ర్యాలీని సీఐ పి.రాజేష్ సోమవారం ప్రారంభించారు. సీఐ మాట్లాడుతూ మానవత సేవలను విస్తృత పరచడం అభినందనీయమన్నారు. ఫారెస్ట్ డిప్యూటీ రేంజర్ నాగేశ్వరరావు మానవత సంస్థకు మొక్కలను అందిస్తామన్నారు. అధ్యక్షుడు ఏవీ.రమణమూర్తి, ఆకుల ధర్మరాజు, త్రిపుర సుందరి, దల్లి కేదారేశ్వరరెడ్డి, పల్లి వెంకటరెడ్డి, టీపీఏ.గోపాలరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

● చింతలపూడి: మానవతా స్వచ్ఛంద సంస్థ, హిందు సమాజ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సాయిబాబా ఆలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలని తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. కొత్తపూడి శేషగిరిరావు, పక్కాల వెంకటేశ్వరావు, ఏ.అప్పారావు, కంటేపూడి వరప్రసాద్, అంజిబాబు, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయ రికార్డు రూమ్ పరిశీలన

కుక్కునూరు, ఆగస్టు 19: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీఐ శ్రీనివాసరావు సోమవారం తహసీల్దార్ కార్యాలయం పరిశీలించారు. రికార్డు బీరువాలను, వాటి భద్రతను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు క్రైం :** సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత భోజన వసతి సౌకర్యాన్ని ఎస్పీ కేపీఎస్ కిశోర్, ఎస్ఈబీ ఏఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు ప్రారంభించారు. ప్రజాసమస్యల పరిష్కారవేదిక అర్జీదారులకు సేవా సమితి ఉచిత భోజనాలను ఏర్పాటు చేస్తున్నారు.
- **ఏలూరు కార్పొరేషన్ :** విశాఖపట్నంలో వచ్చే నెలలో జరిగే ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనాలను జయప్రదం చేయాలని ఏలూరు ఏరియా కార్యదర్శి ఎ.అప్పలరాజు పిలుపునిచ్చారు. ఆర్ఆర్ పేటలో సమ్మేళనానికి సంబంధించిన ప్రచార పోస్టర్స్‌ను ఆవిష్కరించారు.
- **ఏలూరు రూరల్ :** విద్యుత్ కనెక్షన్లు జారీ, ఆస్తి పన్ను విధింపులో అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని దళితసేన వ్యవస్థాపక అధ్యక్షుడు జుజ్జువరపు రవిప్రకాష్ జిల్లా కలెక్టర్ వెట్రిసెల్విని కలిసి వినతి పత్రం అందజేశారు. ఇబ్బందులకు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.
- **బుట్టాయగూడెం :** మండలంలోని 21 పంచాయతీల సర్పంచ్‌లకు కార్యదర్శులకు సోమవారం శిక్షణ ఇచ్చారు. కిరణ్‌కుమార్, రాజారావు, అప్పారావు, సుబ్రహ్మణ్యం అవగాహన కల్పించారు.
- **ఉంగుటూరు :** స్కూల్ కాంప్లెక్స్‌లో శిక్షణతో తరగతి గదుల్లో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని ఎంఈవో -2 భాస్కర్ కోరారు. ఉంగుటూరు, బాదంపూడి, స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో చైర్మన్ గుళ్ళ ప్రసాదరావు ఆధ్వర్యంలో సమావేశాలు జరిగాయి.
- **ద్వారకాతిరుమల :** ద్వారకాతిరుమల ఎస్ఐగా టి.సుధీర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడి ఎస్ఐ సతీష్ వీఆర్‌లో ఉన్నారు.
- టీడీపీ ద్వారకాతిరుమల మండలాధ్యక్ష పదవిని బీసీలకు కేటాయించేలా చర్యలు చేపట్టాలని బీసీ నాయకులు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కూరాకుల బుజ్జియాదవ్, దొప్పసాని సిద్దిరాజు, రేవూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.
- **భీమడోలు :** గ్రామ పంచాయతీ పరిపాలనలో కార్యదర్శులు, గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో పద్మావతి దేవి, ఇవోఆర్డీ సుందరి, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.
- **కొయ్యలగూడెం :** ప్రజలకు సేవలందించడంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు కీలక పాత్ర పోషించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో సతీష్‌కోరారు. సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీపీ రామారావు, జడ్పీటీసీ శ్రీలక్ష్మి, సురేష్, తాతబాబు, నాగేశ్వరరావు ఉన్నారు.
- **కుక్కునూరు :** మండల కేంద్రంలో వంగవీటి రంగా విగ్రహ ఏర్పాటుపై కాపు సంఘ నాయకులు సమావేశమయ్యారు. ములిశెట్టి నాగేశ్వరరావు, మంత్రి గోపాలకృష్ణ, ఎం.యుగంధర్, బాలాజీ పాల్గొన్నారు.
- కుక్కునూరు మండలం వింజరం పంచాయతీలో జిన్నెలగూడెం ఆదివాసీ గ్రామంలో సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో పలువురికి జ్వరాలు ఉన్నాయని టీడీపీ నాయకులు ములిశెట్టి నాగేశ్వరరావు వైద్య సిబ్బందికి సమాచారం ఇచ్చారు.
- **జంగారెడ్డిగూడెం :** పట్టెన్నపాలెం వద్ద జల్లేరు వాగుపై డైవర్షన్ రోడ్డును స్థానికులు స్వచ్ఛందంగా ఎక్స్‌కవేటర్‌తో సరిచేయించారు. డైవర్షన్ రోడ్డు వరద ఉధృతికి పూర్తిగా దెబ్బతినడంతో స్థానికులు రోడ్డుకు మరమ్మతు చేశారు. వాహనాల రాకపోకలు సాగుతున్నాయి.



తాడేపల్లిగూడెం మండలం జగ్గన్నపేటలో పామాయిల్ సాగుకు మొక్కలు నాటిన ఉద్యానశాఖ అధికారులు

ఉద్యానవనానికి ఊతం



పామాయిల్‌పై ప్రత్యేక డ్రైవ్
మెగా ప్లాంటేషన్ కోసం ప్రోత్సాహకాలు
వైసీపీ హయాంలో చెల్లించని ప్రభుత్వం
తాజాగా బకాయిల విడుదల
కొత్త సాగుకు రైతులు ఉరుకులు
ఈ ఏడాది లక్ష్యం 300 హెక్టార్లు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

పామాయిల్ వంటనూనెను భారీ స్థాయిలో ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. వేల కోట్ల రూపాయలు వెచ్చించాల్సి వస్తోంది. ఇటీవల కాలంలో పామాయిల్ ధరలు కూడా పెరిగిపోయాయి. భవిష్యత్తులో దేశీయంగా పామాయిల్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధిం చాలని కేంద్రం నిర్ణయించింది. సాగు చేసిన రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తోంది. దేశంలో 2022-27 వరకు పామాయిల్ సాగు విస్తరించాలని సంకల్పించారు. ఒక్క మన జిల్లాలోనే 1500 హెక్టార్లలో కొత్తగా పామా యిల్ తోటలు పెంచాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. అయితే రైతులకు ఇవ్వా ల్సిన ప్రోత్సాహకాలను వైసీపీ హయాంలో చెల్లించలేకపోయారు. ఇప్పు డిప్పుడే బకాయిలు విడుదలవుతున్నాయి. ఈ ఏడాది 300 హెక్టార్లలో సాగు చేయాలని నిర్ణయించారు. జిల్లాలో తాడేపల్లిగూడెం, మొగల్తూరు, నర్సాపురం, పాలకొల్లు మండలాల్లో పామాయిల్‌కు అవకాశం ఉంది. ప్రతి హెక్టార్‌కు మొక్కలు నాటిన తర్వాత ప్రభుత్వం రూ.29 వేలు చెల్లిస్తుంది. ఎరువులు, ఇతర అవసరాల కోసం రూ.10,400 మంజూరు చేస్తారు. నాలుగు సంవత్సరాల పాటు రూ.10,400 రైతులకు చెల్లిస్తారు. మొక్కలు నాటేందుకు రూ.29వేలు ప్రభుత్వం ఇవ్వనుంది. దాంతో జిల్లాల్లో లక్ష్యాన్ని చేరేందుకు ఉద్యానశాఖ చర్యలు తీసుకుంటోంది.తాడేపల్లిగూడెం రూరల్ మండలం జగ్గన్నపేటలో రైతు పులి సూర్యప్రసాద్‌కు చెందిన 12 ఎక రాల్లో పామాయిల్ సాగుకు మొక్కలు నాటారు. ఉద్యాన శాఖ జిల్లా అధికారి దేవానంద్ కుమార్, ఉద్యానశాఖ డివిజన్ అధికారి శ్రీలక్ష్మి, త్రిబుల్ ఎఫ్ కంపెనీ డీజీఎం విజయప్రసాద్, రైతులు ఏడుకొండలు, సత్య నారాయణ, కృష్ణ, కామేశ్వరరావు పాల్గొన్నారు.



కొండంగి లాకుల వద్ద ప్రమాదకరంగా ఉన్న అప్రోచ్ రోడ్డు

ప్రమాదకరంగా అప్రోచ్ రోడ్డు

పట్టించుకోని అధికారులు

కలిదిండి, ఆగస్టు 19 : మండలంలో కొండంగి లాకుల వద్ద సీబీ కెనాల్‌పై వంతెన అప్రోచ్ రోడ్డు ప్రమాదకరంగా ఉంది. రెయిలింగ్ లేక వాహనాలు అదుపు తప్పి కాల్వలో పడి వాహ నదారులు గాయపడుతున్నారు. రోడ్డు మార్జిన్ కోతకు గురవటం, ఎదురెదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే వీలు లేకపోవటంతో గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోతోంది. దీంతో ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు. ఉప్పుటేరు వెంబడి ప్రధాన రహదారి ఈ వంతెనపై నుంచి వెళ్లటంతో నిత్యం వంతెన రద్దీగా ఉంటుంది. ఈ వంతెన వద్ద మలుపు ప్రమాదకరంగా ఉంది. కాగా ఈ వంతెన పక్కనే కొండంగి 1, 2 ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. వీటిని పునః ప్రారంభించటంతో నిత్యం రైతుల రాకపోకలతో కిక్కిరిసి ఉంటుంది. రైతులు రాత్రి వేళల్లో కూడా వంతెనపై నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. గతంలో పలు వాహనాలు అదుపు తప్పి సీబీ కెనాల్‌లో బోల్తా పడి పలువురు గాయాలపాలయ్యారు. ఈ వంతెన అప్రోచ్ రోడ్డు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కొండంగి లాకుల వద్ద వంతెనకు ఇరువైపులా ఉన్న అప్రోచ్ రోడ్డుకు రైలింగ్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



చాట్రాయి సెంటర్‌లో ట్రాఫిక్ పరిస్థితి

చాట్రాయిలో ట్రాఫికర్

చాట్రాయి, ఆగస్టు 19: మండల కేంద్రం చాట్రాయిలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు జఠిలం అవుతుండటంతో ప్రజలు వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాలను కలిపే రహదారిలో చాట్రాయి ఉండటంతో నిత్యం వందలాది వాహనాలు చాట్రాయి మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. దీనికి తోడు సూర్యాపేట-రాజమహేంద్రవరం మధ్య నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేకి చాట్రాయి మీదుగా భారీ వాహనాలతో మెటల్ తరలిస్తున్నారు. ఆర్టీసీ బస్సులు, స్కూల్ బస్సులు నడుస్తుంటాయి. చాట్రాయిలో రోడ్లు బాగా ఇరుకుగా ఉంటాయి. వ్యాపార సంస్థలు, హోటళ్ళు, ఇతర దుకాణాలు గ్రామ కూడలిలోనే ఉన్నాయి. రెండు వాహనాలు ఎదురు ఎదురుగా వస్తే తప్పుకోవటం బ్రహ్మప్రళయంగా మారింది. దీనితో తరుచు ట్రాఫిక్ నిలిచిపోతున్నది. రోడ్లు వెడల్పు చేస్తేనే ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, చాట్రాయి గ్రామ పరిధిలో విస్సన్నపేట-వెలగలపల్లి రోడ్డు, చిత్తపూరు-బూరుగ్గూడెం రోడ్డు 5 కిలో మీటర్లు మెడల్పు చేయించటానికి రూ 5కోట్లతో అంచనాలు తయారు చేయించి, నిధులు మంజూరుకు తీవ్రంగా కృషి చేశారు. కానీ ఫలితం కలగలేదు. నూజివీడు ఎమ్మెల్యే, గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి చొరవతీసుకొని చాట్రాయిలో రోడ్లు వెడల్పుకు నిధులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుక అక్రమ రవాణా.. ట్రాక్టర్ సీజ్



ముసునూరు, ఆగస్టు 19: మండలంలోని బలివే తమ్మిలేరు నుంచి అక్రమంగా ఇసు క రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను ముసునూరు పోలీసులు ఆది వారం రాత్రి సీజ్ చేశారు. ముసునూరుకు చెందిన నక్కా వెంకటేశ్వరరావు తన ట్రాక్టర్‌తో అనుమతులు లేకుండా బలివే తమ్మిలేరు నుంచి ఇసుకను లోడ్ చేసుకుని, ముసునూరు తరలిస్తుండగా గోపవరం శివారు నాగేంద్రపురం సెంటర్ వద్ద దాడిచేసి పట్టుకున్నట్లు ఏఎస్సై నాగభూషణరావు తెలిపారు. ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని యజమాని వెంకటేశ్వరరావుపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు. మండలంలోని తమ్మిలేరు నుంచి ఇసుక రవాణాకు అనుమతులులేవని, ఇసుకను అక్రమంగా తరలిస్తే వాహనాలు సీజ్ చేయడంతో పాటు భారీ జరిమానా విధిస్తామని ఏఎస్సై హెచ్చరించారు.

ఘనంగా రాఖీ పండుగ

కైకలూరు/కలిదిండి/ముదినేపల్లి/చాట్రాయి/ముసునూరు, ఆగస్టు 19 : సోదర, సోదరమణుల మధ్య ప్రేమ, ఆప్యాయతకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్‌ను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. సోదరిలు తమ సోదరుడికి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దుకాణాల్లో రాఖీల విక్రయాలు జోరుగా సాగాయి. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ పంపిన రాఖీలను ముదినేపల్లి మండలంలోని వైవాక యూపీ పాఠశాలలో బాలికలు తమ తోటి విద్యార్థులైన బాలుర చేతికి కట్టి సోదర ప్రేమను పంచుకున్నారు. ముదినేపల్లిలో టీడీపీ నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్‌కు పలువురు మహిళలు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.





వైవాక పాఠశాలకు ఎంపీ పుట్టా మహేష్ పంపిన రాఖీలను బాలురకు కడుతున్న బాలికలు.. టీడీపీ నాయకుడు కొడాలి వినోద్‌కు రాఖీ కడుతున్న మహిళలు

గొర్రెలు, మేకలకు బీమా సౌకర్యం



గొల్లగూడెం అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న సారథి

పెంపకందార్ల అవగాహన సదస్సులో మంత్రి పార్థసారథి

ఆగిరిపల్లి, ఆగస్టు 19: జిల్లాలో 5 లక్షలు గొర్రెలు, 3 లక్షల మేకలు ఉన్నాయని, వీటికి పశు సంవర్ధకశాఖ ద్వారా బీమా సౌకర్యం ఉంటుందని మంత్రి పార్థసారథి తెలిపారు. ఆగిరిపల్లి మండలం ఎస్. గొల్లగూడెంలో జరిగిన గొర్రెల, మేకల పెంపకందారుల అవగాహన సదస్సులో మంత్రి పాల్గొన్నారు. గొర్రెలు, మేకల షెడ్లకు సబ్సిడీ లోన్లు 70 శాతం వరకు ఇస్తారని తెలిపారు. నిజమైన సంచార జాతులు గొర్రెల కాపరులే అన్నారు. గొర్రెలు, మేకల కోసం కొండలు, గుట్టలు తరిగిపోకుండా చూడాలన్నారు. ముందుగా గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి మంత్రి పూలమాలవేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు పలగాని గంగాధర్, బడుగు సోమయ్య, మండలపు నరేష్, ఆరేపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మా భూములకు పట్టాలిప్పించండి..

గత 20 ఏళ్లగా తాను సాగుచేసుకుంటున్న భూమికి దొంగ పట్టాలు సృష్టించి కొందరు దళారులు తమ భూములు లాక్కోవడానికి ప్రయత్నిస్తున్నారని చిన్నాగిరిపల్లి గ్రామ దళితులు మంత్రి సారథికి ఫిర్యాదు చేశారు. గతంలో ప్రభుత్వం పేదలకు ఇచ్చిన భూములు ఒక వ్యక్తి కబ్జాచేసి దొంగ పేర్లతో పట్టా తెచ్చి అనుభవిస్తున్నాడని 2005లో పోరాటం చేసి భూములు సర్వే చేయిస్తే అధికారులు ఇది పేదల భూమిగా తేల్చారని ఇప్పుడు కొందరు దళారులు భూమి తనదని బెదిరిస్తున్నారని, తోటపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న భూ రికార్డులను పరిశీలించి తమకు పట్టాలు ఇప్పించాలని సీపీఎం నాయకుడు సత్తు కోటేశ్వరావు ఆధ్వర్యంలో దళితులు మంత్రికి మొరపెట్టుకున్నారు.



ముదినేపల్లిలో టీచర్ల సర్దుబాటు ప్రక్రియ నిర్వహిస్తున్న ఎంఈవో

సర్దుబాటు టీచర్ల కౌన్సెలింగ్

ముదినేపల్లి, ఆగస్టు 19 : ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ కౌన్సెలింగ్ సోమవారం ముదినేపల్లి మండలంలో ప్రారంభమయింది. స్థానిక మండల రిసోర్స్ సెంటర్‌లో మండల విద్యాధికారి కె.నరేష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కౌన్సెలింగ్‌లో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 36 మంది మిగులు ఉపాధ్యాయులు సర్దుబాటుకు అంగీకారం తెలపగా, 13 మంది టీచర్లను మండలంలోని 11 పాఠశాలలకు సర్దుబాటు చేశారు. మండలంలో మిగిలిన నలుగురు మినిమమ్ టైమ్ స్కేల్ టీచర్లు, ఒక లెక్కల సబ్జెక్టు టీచరు, 18 మంది తెలుగు, ఇంగ్లీష్ పండిట్లను డివిజన్‌లోని ఇతర మండలాల పాఠశాలల్లో సర్దుబాటు చేస్తారని అధికారులు తెలిపారు. సర్వర్లు పని చేయకపోవటంతో సర్దుబాటు ప్రక్రియను ఆన్‌లైన్ చేయటంలో జాప్యం జరుగుతున్నది. ఉపాధ్యాయ సంఘాల నాయకులు బేతాళ రాజేంద్ర ప్రసాద్, ఐ.దుర్గా ప్రసాద్, బేతాళరావు, ఏ.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ



మండవల్లి ఆగస్టు 19 : మండవల్లి మెయిన్ సెంటర్లో పునః నిర్మించిన శ్రీకృష్ణ మండపంలో సోమవారం శ్రీకృష్ణుడి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. సీతారాముల విగ్రహాల్ని కూడా ప్రతిష్ఠించారు. ప్రత్యేక హోమాలు జరిగాయి. కైకలూరు ఏఎంసీ మాజీ చైర్మన్ వీర్రాజు, సహకార సంఘం మాజీ అధ్యక్షుడు బొమ్మనబోయిన గోకర్ణ యాదవ్, యాదవ సంఘం ప్రముఖులు పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన పలువురు రాజకీయ నాయకులను యాదవ యువకులు సత్కరించారు. భారీ అన్నసమారాధన జరిగింది.



మంత్రికి ఇబ్బందులు వివరిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

కంప్యూటరీకరణలో సమస్యలు పరిష్కరించాలి

ముదినేపల్లి, ఆగస్టు 19: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల కంప్యూటరీకరణ ప్రక్రియలో ఉద్యోగుల ఇబ్బందులను పరిష్కరించాలని రాష్ట్ర సహకార శాఖా మంత్రి అచ్చెన్నాయుడును సోమవారం సచివాలయంలో ఏపీ పీఏసీఎస్ ఎంప్లాయిస్, కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు కోరారు. కంప్యూటరైజేషన్‌లో సర్వర్ల సమస్య ఉంటున్నదని, సెలవు దినాల్లో కూడా పని చేయాలని ఒత్తిడి చేస్తున్నారని, కంప్యూటరైజేషన్‌పై నిర్వహిస్తున్న సమీక్షల్లో అధికారులు సంఘాల ఉద్యోగులతో అనుచితంగా మాట్లాడుతున్నారని ఏపీ పీఏసీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొల్లినేని రఘురామ్, కో-ఆపరేటివ్ బ్యాంకుల ఎంప్లాయిస్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి కె.వి.ఎస్.రవికుమార్ తదితర నాయకులు మంత్రికి ఫిర్యాదు చేశారు. కంప్యూటరైజేషన్‌కు సాఫ్ట్‌వేర్ సామర్థ్యం తక్కువగా ఉందని, డేటా ఎంట్రీకి అవస్థలు పడుతున్నామని, కంప్యూటరైజేషన్‌కు సిబ్బందికి ప్రాథమికంగా శిక్షణ కూడా ఇవ్వలేదని వివరించారు. దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు, ఆప్కాబ్ ఎండి శ్రీధర్ రెడ్డి సమస్యలను పరిష్కరిస్తామని, సాఫ్ట్‌వేర్ సామర్థ్యం పెంచేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని రఘురామ్ తెలిపారు.

పోలవరంలో పారిశుధ్య పనులు



చాట్రాయి, ఆగస్టు 19: మండలంలోని పోలవరం పంచాయతీ ఆధ్వర్యంలో సోమవారం ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. వీధులు శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు. వైద్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్ళి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమ తెరలు వాడాలని, వేడి ఆహారం మాత్రమే తినాలని, జ్వర లక్షణాలు కన్పిస్తే వెంటనే పీహెచ్‌సీకి వచ్చి చికిత్స పొందాలని విజ్ఞప్తి చేశారు.

రొయ్యల చెరువులతో ఎండిన పైరు



ములకలపల్లిలో దెబ్బతిన్న పొలాలు చూపిస్తున్న ఆంద్రియ్య

ములకలపల్లి రైతుల ఆవేదన

ముదినేపల్లి, ఆగస్టు 19 : మండలంలోని ములకలపల్లి గ్రామంలో రొయ్యల చెరువుల నుంచి వస్తున్న నీటి ఊటతో వరి పొలాలు దెబ్బతింటున్నాయి. చెరువుల పక్కనే ఉన్న పొలాలు, చెరువుల నుంచి ఇంజన్లతో పంట బోదెలోకి తోడుతున్న నీటి వల్ల వరి పైరు పాడైపోతున్నట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రొయ్యల చెరువులకు బోర్లు వేయటం వల్ల ఉప్పునీరు పెరిగి సరిహద్దు పొలాల్లో ఊట చేరి వరి పైరు పెరగటం లేదు. పొలాలకు పంట కాల్వల ద్వారా మంచినీరు పెట్టినా ఆ నీరు ఉప్పునీరుగా మారి వరి నాట్లు ఎండిపోయాయి. ఆ గ్రామ ఎస్సీ కాలనీకి సమీపంలో ఉన్న రొయ్యల చెరువుల వల్ల మంచినీటి బావులు కూడా పాడైపోయాయని కాలనీ వాసులు తెలిపారు.

ఉప్పునీటి ఊటతో నష్టం : ప్రత్తిపాటి ఆంద్రియ్య, రైతు

రొయ్యల చెరువుల నుంచి ఉప్పునీరు ఊరి నా పొలంలో నాటిన వరి పైరు పూర్తిగా దెబ్బతింది. వేలాది రూపాయల నష్టం వాటిల్లింది. చెరువుల నుంచి నీటిని పంట కాల్వలోకి తోడుతుండటంతో మంచినీరు కూడా ఉప్పునీరుగా మారుతున్నది.



బోర్లతో ఇబ్బంది : సంజీవరావు, కౌలు రైతు

రొయ్యల చెరువులకు ఉప్పునీటి కోసం బోర్లు వేయటం వల్ల పరిసర పొలాలకు నష్టం కలుగుతోంది. వరి పొలాలకు పంట కాల్వ నుంచి మంచినీరు పెట్టుకునే అవకాశం లేకుండా పోయింది. నా మూడెకరాల కౌలు భూమిలో వరి పైరు ఎండిపోయింది. అధికారులు పరిహారం ఇప్పించాలి.

దూర విద్య టెన్త్, ఇంటర్ అడ్మిషన్లకు పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, డీఈవో, జేసీ

ఏలూరు అర్బన్, ఆగస్టు 19: ఏపీ సార్వత్రిక విద్యా పీఠం (అపోస్) దూరవిద్య టెన్త్, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు ముద్రించిన పోస్టర్లను కలెక్టర్ వెట్రిసెల్వి సోమవారం విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ ఐసీడీఎస్, డ్వాక్రా, మెప్మా, జువనైల్ హోం శాఖల జిల్లా అధికారులు సంబంధిత శాఖల్లో లబ్ధిదారులు, సభ్యులు, మహి ళలకు సార్వత్రిక విద్య పదోతరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు కృషి చేయాలన్నారు. దూరవిద్య కోర్సులు పూర్తిచేసుకున్నవారు ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హులని ప్రచారం కల్పించాలన్నారు. ఓపెన్‌స్కూల్స్ అడ్మిషన్లు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని డీఈవో అబ్రహంకు సూచించారు. జేసీ ధాత్రిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అనుకూలం : కలెక్టర్

జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ఎంతో అనుకూలమని కలెక్టర్ వెట్రిసెల్వి పేర్కొన్నారు. పారిశ్రామికవేత్తలతో సోమవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం సహకరిస్తుందని హామీ ఇచ్చారు. ఆహారశుద్ధి యూనిట్లు, ఐటి ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. సమావేశంలో లేవనెత్తిన సూచనలు, ఫీడ్‌బ్యాక్‌ను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ జిల్లా అధ్యక్షుడు వంకాయల రామకృష్ణారావు, ఫిక్కీ ప్రతి నిధులు ఎన్.వెంకటేశ్వరరావు, ఎస్.భరత్, సీహెచ్.నవ్యశ్రీ, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం ఆదిశేషు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ బాబ్జి, డీఆర్డీఏ పీడీ విజయరాజు, డీపీవో విశ్వనాథ్, కర్మాగారాల డీఐ త్రినాథరావు, డీటీసీ శాంతకుమారి పాల్గొన్నారు.

స్వయం ఉపాధితోనే నిరుద్యోగ సమస్యకు చెక్

నన్నయ వీసీ

ఏలూరు అర్బన్, ఆగస్టు 19: ఉన్నత విద్య పూర్తిచేసిన యువత సృజనాత్మకతతో నూతన వ్యాపార అవకాశాల పై దృష్టిసారిస్తే దేశంలో నిరుద్యోగ సమస్య ఉండబో దని ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం ఉప కులపతి వై.శ్రీనివాసరావు అన్నారు. సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో సోమవారం నిర్వహించిన స్నాతకోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నూతన జాతీ య విద్యా విధానంలోని ముఖ్యాంశాలను ప్రస్తావిస్తూ యువత స్వయం ఉపాధి అవకాశాలపై దృష్టిపెట్టి ఉద్యోగావకాశాలను కల్పించుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ మాట్లాడుతూ కళాశాలలో ఉన్నత విద్య ముగించిన విద్యార్థినులు జీవి తంలో ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షించారు. ఫైనలియర్ విద్యార్థినులు క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఉద్యోగాలకు అర్హత సాధించారని వివరించారు. వివిధ కోర్సుల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు ఉప కులపతి బంగారు, వెండి పతకాలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కళాశాల జీవితంలో తమ అనుభవాలను పలువురు విద్యార్థినులు పంచుకున్నారు. కరస్పాండెంట్ మదర్ ఎర్నెస్టెన్ ఫెర్నాండెజ్, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ మరియా క్రిస్టియా, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సిస్టర్ సుశీల, ఇంటర్మీడియట్ కళాశాల ప్రిన్సిపాల్ డిగాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.



చాట్రాయిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఫొటోగ్రాఫర్లు

ఫొటోగ్రాఫర్ల సమస్యలు పరిష్కరించాలి

చాట్రాయి, ఆగస్టు 19: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం చాట్రాయిలో ఫొటోగ్రాఫర్లు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం ఫొటోగ్రాఫర్లకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం మండల ఫొటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు సోమిశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశమై ఇన్సూరెన్స్ ప్రభుత్వం దృష్టికి తేవాల్సిన ఫొటోగ్రాఫర్ల సమస్యలపై చర్చించారు. సంఘం నాయకులు షణ్ముఖ, సుమన్, మురళీ, కేశవ నరసింహారావు వివిధ గ్రామాల ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న విగ్రహం ఏర్పాటుకు వినతి



నూజివీడు, ఆగస్టు 19: బీసీ నాయకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు గౌతు లచ్చన్న విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని కేటాయించాల్సిందిగా కోరుతూ గౌడ యూత్ ఆధ్వర్యంలో నూజివీడు ఆర్డీవోకి వినతిపత్రం అందించారు. నూజివీడు నియోజకవర్గంలో ఎక్కడా లచ్చన్న విగ్రహం లేదని, ఆయన సేవలను స్మరించుకునేలా విగ్రహం ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాల్సిందిగా కోరుతూ నూజివీడు గౌడ యూత్ నాయకుడు పామర్తి రవిబాబు ఆధ్వర్యంలో ఆర్డీవో వై.భవాని శంకరికి వినతి పత్రం అందించారు.

8 అర్జీల స్వీకారం : ఆర్డీవో

నూజివీడు, ఆగస్టు 19: నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 8 అర్జీలు దాఖలైనట్టు ఆర్డీవో భవాని శంకరి తెలిపారు. సంబంధిత శాఖ అధికారులు, అర్జీదారుల సమస్యలు సత్వరం పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు.

కలిదిండి: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మూడు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. ఒంటరి మహిళల పింఛన్ కోసం 2, తాడినాడలో సరిహద్దు రాళ్లు తొలగించారని ఒక అర్జీ సమర్పించారన్నారు. ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ట్రిపుల్ ఐటీ ఏవోగా లక్ష్మణరావు



నూజివీడు టౌన్, ఆగస్టు 19: ఆర్జీయుకేటీ నూజివీడు క్యాంపస్ నూతన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా డాక్టర్ బి.లక్ష్మణరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉన్న ఆయన ఈ పదవిలో ఏడాది పాటు కొనసాగుతారు. గతంలో డీన్ ఆఫ్ అకాడ మిక్స్ చీఫ్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్‌గా లక్ష్మణరావు బాధ్యతలు నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాంపస్‌లో నూతనంగా చేరిన విద్యార్థుల కోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ చంద్రశేఖర్, ఇతర సిబ్బంది అభినందించారు.

నేడు ఎత్తిపోతల పథకాలు పునః ప్రారంభం

కలిదిండి, ఆగస్టు 19 : ఉప్పుటేరు వద్ద ఉన్న కొండంగి 1, 2 ఎత్తిపోతల పథకాలను కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మంగళవారం పునః ప్రారంభిస్తారని టీడీపీ మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి తెలిపారు. సాగునీటి కొరత సమస్యను పరిష్కరించటానికి ఎత్తిపోతల పథకాలు పునఃప్రారంభిస్తున్నారని, రైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

నేడు అందుబాటులో ఎమ్మెల్యే కామినేని

కైకలూరు ఆగస్టు 19: కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ మంగళవారం నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొనున్నారు. ఉదయం 8 గంటలకు తన స్వగ్రామం వరహాపట్నం చేరుకుంటారు. అనంతరం కలిదిండి మండలంలోని ఎత్తిపోతల పథకాన్ని పునఃప్రారంభించి నీటిని విడుదల చేస్తారు. అనంతరం కైకలూరు చిన్నచెరువుగట్టుపై ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో అన్నసమారాధనలో పాల్గొంటారు. అనంతరం ఆయన ఇంటి వద్ద ప్రజలకు అందుబాటులో ఉంటారు.

28న వరసిద్ధి వినాయక విగ్రహ ప్రతిష్ఠ

కైకలూరు, ఆగస్టు 19: రామవరంలోని అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వరసిద్ధి వినాయక, నవగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాన్ని ఈ నెల 28న నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. స్వామివారికి విశేష పూజలు నిర్వహిస్తారని భక్తులు పెద్దఎత్తున పాల్గొనాలని కమిటీ సభ్యులు కోరారు. ఈ సందర్భంగా 27వ తేదీన మహిళలు బిందెలతో నీటిని తెచ్చి విగ్రహాలను అభిషేకిస్తారన్నారు.

దివ్యాంగులకు దాతలు అండగా నిలవాలి



ఆగిరిపల్లి, ఆగస్టు 19: పలు కారణాల వల్ల అవయవాలు కోల్పోయిన వారికి దాతలు అండగా నిలవాలని హీల్ ఫెసిలిటీస్ డైరెక్టర్ టి.భాస్కర్ అన్నారు. తోటపల్లిలో గల హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో ఎన్టీఆర్ జిల్లా నందిగామకు చెందిన గరికపాటి రాజేశ్వరికి సంస్థ కార్యదర్శి తాతినేని లక్ష్మి చేతుల మీదుగా కృత్రిమ కాలును అందచేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కృత్రిమ కాళ్ళ కోసం 92 మంది దరఖాస్తుదారులు వేచి ఉన్నారన్నారు. హీల్ సీఈవో కూరపాటి అజయ్‌కుమార్, సీనియర్ టెక్నీషియన్ కె. చిన్నా, సిబ్బంది పాల్గొన్నారు.

సత్యసాయి పాఠశాలకు దాతల చేయూత

నూజివీడు టౌన్, ఆగస్టు 19: శ్రీ సత్యసాయి బాల భారతి పాఠశాలకు పలువురు దాతలు ఆర్థిక సాయం అందించారు. విద్యార్థుల వసతుల కల్పనకు నూజివీడు లయన్స్ క్లబ్ సహకారంలో సిల్వర్ హోప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ కరస్పాండెంట్ వల్లభనేని ధనుంజయ్ విద్యార్థుల పాఠ్య పుస్తకాలకు రూ.50 వేలు, ప్రముఖ కార్డియాలజిస్టు కొడాలి సతీష్ నోటు పుస్తకాల కోసం రూ.19 వేలు, పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు రూ.25 వేలను ఆర్థిక సాయంగా అందించారు. దాతలకు నూజివీడు లయన్స్ క్లబ్ సభ్యుడు పి.కృష్ణప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి



బూరుగ్గూడెంలో ఈక్రాప్ నమోదు

చాట్రాయి, ఆగస్టు 19: రైతులంతా తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయించుకొని ప్రభుత్వ సదుపాయాలు పొందాలని వ్యవసాయాధికారి శివశంకర్ కోరారు. మండలంలోని బూరుగ్గూడెంలో సోమవారం ఏవో ఆధ్వర్యంలో వ్యవసాయ సిబ్బంది ఈక్రాప్ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో ఉండే వీఏఏలు, వీహెచ్ఏలు, ఎంపీఈవోలను కలసి ఈక్రాప్ నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ క్రాప్ నమోదు చేయించుకోవటం వల్ల పంటలకు గిట్టుబాటు ధర, క్రాప్ ఇన్సూరెన్స్, ప్రకృతి వైపరీత్యాల నష్టపోతే ఇన్‌పుట్ సబ్సిడీ తదితర రాయితీలు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు.